ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
బుధవారం 21 ఆగస్టు 2024



ముగిసిన శ్రీవారి దివ్య పవిత్రోత్సవాలు

ద్వారకాతిరుమల, ఆగస్టు 20 : శ్రీవారి దివ్య పవిత్రోత్సవాలు మంగళవారం ఉదయం జరిగిన విశేష కార్యక్రమాలతో ముగిశాయి. ఏడాది పొడవునా ఆలయంలో తెలిసీ, తెలియక దొర్లిన తప్పుల ప్రాయఃచిత్తము నిమిత్తం నిర్వహించిన ఈ ఉత్సవాలు నాలుగు రోజులపాటు ఘనంగా జరిగాయి. ఉదయం పవిత్రావరోహణ, శ్రీమహా పూర్ణాహుతి హోమాన్ని, శ్రీమహదాశీర్వచనాన్ని అర్చకులు, పండితులు వైభవోపేతంగా నిర్వహించారు. శ్రీవారి మూలవిరాట్, అలివేలు మంగమ్మ, ఆండాళ్ అమ్మవార్లు, ఉత్సవమూర్తులపై ఉంచిన దివ్య పవిత్రాలను అర్చకులు వేదమంత్రోచ్చరణల నడుమ తొలగించారు. నాలుగు రోజులుగా నిలిచిన ఆర్జిత సేవలు, నిత్యార్జిత కల్యాణాలు బుధవారం నుంచి పునరుద్ధరిస్తామని ఆలయ ఈవో త్రినాధరావు తెలిపారు.



కొండంగి ఎత్తిపోతల 1, 2 పథకాలను పునఃప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కామినేని

కొండంగి ఎత్తిపోతలతో వేల ఎకరాల్లో సాగు


కలిదిండి, ఆగస్టు 20 : కొండంగి ఎత్తిపోతల పథకాలు లంక గ్రామాలకు ఒక వరమని కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కొండంగి 1, 2 ఎత్తిపోతల పథకాలను పునఃప్రారంభించి మాట్లాడారు. ఎత్తిపోతల ద్వారా 20 వేల ఎకరాలకు సాగు నీరందిస్తున్నట్లు చెప్పారు. ఎత్తిపోతల నుంచి ప్రవహించే ఉప్పుటేరులో తీపి నీరును లంక గ్రామాలతోపాటు కలిదిండి, పడమటిపాలెం, సానారుద్రవరం, కోరుకొల్లు వరకు సీబీ కెనాల్ ద్వారా అందిస్తామన్నారు. కాల్వ గట్లు పటిష్టం చేయడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమవడం వల్లే సాగునీటి కొరత ఏర్పడిందన్నారు. సాగు నీటి సంఘాలు ఏర్పడిన తర్వాత గట్లు పటిష్టతకు చర్యలు తీసుకుంటామన్నారు. 660 మండలాల్లో కలిదిండి మండలం తలసరి ఆదాయంలో ప్రథమ స్థానం ఉందన్నారు. చేపలు, రొయ్యల చెరువులు అధికంగా ఉండటంతో చేపలు, రొయ్యల అధిక విక్రయాలతో తలసరి ఆదాయం ఎక్కువగా వస్తుందన్నారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త వీరమల్లు నరసింహారావు, జోగి రాజు, వల్లభనేని శ్రీనివాస్‌చౌదరి, జడ్పీటీసీలు బొర్రా సత్యవతి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు నిరసనగా నేడు భారత్ బంద్

పోలవరం/కొయ్యలగూడెం, ఆగస్టు 20 : ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ బుధవారం దేశవ్యాప్త బంద్ నిర్వహించనున్నారు. ఈ మేరకు మాల మహానాడు, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక సమితి నాయకులు బంద్‌కు సహకరించాలని పిలుపునిచ్చారు. వ్యాపార, విద్యా సంస్థలు బంద్‌కు సహకరించాలని పోలవరం ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక సమితి నాయకులు సొబ్బన మోహన్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యా, వ్యాపారసంస్థలు, వర్తకులు బంద్‌కు సహకరించాలని కొయ్యలగూడెంలో మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి ఆర్.నాగరాజు కోరారు.

పొగాకుపై పెనాల్టీ రద్దు

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 20 : వర్జీనియా పొగాకు రైతులు అదనంగా పండించిన పొగాకుపై పెనాల్టీను రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెలలో దేవరపల్లిలో జరిగిన పొగాకు రైతుల అవార్డుల వేడుకలో వారు చేసిన విజ్ఞప్తి మేరకు.. అదనంగా పండించిన పొగాకుకు పెనాల్టీ లేకుండా చూడాలని ఎంపీ కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తెలిపారు. ఈ రద్దుతో ఏలూరు జిల్లాలో 15 వేల మంది రైతులు రూ.15 కోట్లు, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లక్ష మంది పొగాకు రైతులు రూ.110 కోట్లు లబ్ధి పొందారన్నారు.



టార్గెట్ సెంచరీ

- వంద రోజుల్లోపే ముందడుగుకు సిద్ధం
- ఆ దిశగా కూటమి ప్రభుత్వం సన్నాహాలు
- జల జీవన్ కింద నాలుగు వేల కుళాయి కనెక్షన్లు
- రెండు వేల ఎకరాల ఉద్యాన వనాల విస్తరణ
- అన్ని శాఖల్లోను అప్రమత్తత..
- యంత్రాంగంలోను కదలిక

రాష్ట్రంలో ఐదేళ్ళ దుర్మార్గ పాలన అంతమై.. మెరుగైన పాలన కళ్ళెదుటే ఉండాలని ప్రజలు కోరుకున్నారు. అభివృద్ధి, సంక్షేమం పరుగులు తీయాలని ఆకాంక్షించారు. నాటి నిరాశ, నిస్పృహల స్థానంలో యంత్రాంగం పరుగులు తీయాలని భావించారు. రెండు నెలలు గడవక మునుపే పేదలు ఎదురు చూస్తున్నట్టు ప్రభుత్వ యంత్రాంగంలో కదలిక వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పాలనలో వాడివేడి పెంచినట్టుగానే కొన్ని రంగాల్లో నూరు రోజుల్లోనే అసలు లక్ష్యాలను సాధించాలని లక్ష్యాలను ఎంచుకుంది.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి):

కొన్నేళ్ల క్రితం జిల్లాలో జల జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కుళాయి అందించాలనే పథకానికి కేంద్రం శ్రీకారం చుట్టింది. కాని జగన్ సర్కార్ దీనిని గాలికొదిలేసింది. కనీసం జిల్లాస్థాయిలో ఒకసారి కూడా ఉన్నతస్థాయి సమీక్ష జరగ లేదు. అధికారుల నుంచి నివేదికలు రప్పించి ఈ ప్రాజెక్టును ఎలా ముందుకు నడపాలో అప్పటి ప్రభుత్వానికి పట్టలేదు. వాస్తవానికి జిల్లాలో రూ.230 కోట్లతో 133 గ్రామాలకు తాగు నీటి ప్రాజెక్టు పనులు చేపడుతున్నారు. వీటి కింద ఇంటింటికి మంచినీటి కుళాయి కనెక్షన్‌ను అమర్చాలని లక్ష్యంగా తీసుకున్నారు. కూటమి ప్రభుత్వం ఇప్పుడు దీనిపై ఫోకస్ పెట్టింది. పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో కుళాయి కనెక్షన్లకు భారీగా డిమాండ్ ఉంది. ఇప్పటికే కుళాయి కనెక్షన్ కోసం ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు వంటి మునిసిపాలిటీల్లోను దరఖాస్తులకు కొదవలేదు. పల్లె సీమల్లోను సాధారణ కుళాయి కనెక్షన్లు ఇప్పటికే తొలగించారు. ఇంటింటికి కుళాయి కనెక్షన్లను మాత్రమే కొనసాగిస్తున్నారు. తాగునీటికి సొంత కుళాయి కనెక్షన్ ఉంటే ఇంటి యజమానికి కొండంత అండ. రాబోయే వంద రోజుల్లో ఆరు నూరైనా కనీసం కుళాయి కనెక్షన్ ఏమిటో ఇచ్చి చూపించాలని ప్రభుత్వం సవాల్‌గా భావిస్తోంది. వంద రోజుల్లో జిల్లావ్యాప్తంగా నాలుగు వేల కుటుంబాలకు ఈ తరహా కనెక్షన్లు ఇవ్వాలని లక్ష్యం నిర్ణయించుకుని పరుగులు పెట్టడం ఆరంభించింది. సాధారణంగా తాగునీటి కొరత డెల్టా ప్రాంతంకంటే మెట్టలోనే అత్యధికం. మంచినీటి చెరువులు, మంచినీటి బావులు ఏనాడో అదృశ్యమయ్యాయి. ఇప్పుడు తాగు నీరందించే బాధ్యత ప్రభుత్వం మీద పడింది. ఆ మేరకు కుళాయి కనెక్షన్ కోసం ఎదురుచూసే కుటుంబాల సంఖ్య 20 వేలకుపైగా ఉంది. కేంద్ర సాయం ఉండనే ఉంది కాబట్టి జల జీవన్ మిషన్‌ను పూర్తిగా వినియోగించాలని కూటమి ప్రభు త్వం భావిస్తోంది. ఎమ్మెల్యేలు, ఎంపీలు అప్రమత్తమై తమ ప్రాంతాల్లో ఈ తరహా డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకుని అధికారులను అప్రమత్తం చేశారు.

మరో టార్గెట్ ఉద్యాన పంటలు

పల్లెల్లో జల జీవన్ మిషన్ కింద కుళాయి కనెక్షన్ ఎలా కోరుకుంటున్నారో మెట్ట ప్రాంతాల్లో ఉద్యాన పంటల విస్తరణకు రైతులు అలాగే కోరుతున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని రాబోయే వంద రోజుల్లోనే ఈ తరహా పంటలు విస్తరించాలని ఇప్పటికే జిల్లాలో ప్రత్యేక కార్యాచరణ ఆరంభమైంది. ఉద్యాన పంటల విస్తరణకు సంబంధిత శాఖలకు లక్ష్యాలు నిర్ణయించడమే కాకుండా రైతులు కలిసొచ్చేలా విస్తృత ప్రణాళిక అమలు చేయబోతున్నారు. ఇప్పటికే అయిల్‌ఫాం, కోకో సాగులో జిల్లా రాష్ట్రంలోనే తొలిస్థానంలోనే ఉంది. దీనికితోడు ఉద్యాన పంటల విస్తరణకు వీలుగా సమీకృత ఉద్యాన వనాలు అభివృద్ధి, రాష్ట్రీయ కృషి వికాస యోజన, గ్రామీణ ఉపాధి హామీ పథకాల్లో రెండు వేల హెక్టార్లలో ఈ తరహా పంటలను అభివృద్ధి చేయాలని కార్యాచరణ రూపొందించింది మొదలు ఇప్పుడు ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే పెదవేగి మండలం ఉద్యాన పంటల్లో జిల్లాలోనే అత్యధికం. ఈ తరహా విధానం అన్నిచోట్ల అమలయ్యేలా రైతుల ఆశలు, ఆకాంక్షలను పరిగణనలోకి తీసుకుంటున్నారు. ఈ క్రమంలోనే ఉద్యాన పంటల విస్తరణకు కూటమి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వంద రోజుల వ్యవధిలోనే పంటల విస్తీర్ణంకు ఏం చేయబోతున్నారో, ఎలాంటి ఫలితాలు రాబట్టబోతున్నారో నివేదికలు కోరింది. దీనిని ఆషామాషీగా తీసుకోకుండా సీరియస్‌గానే భావిస్తూ తగిన ఫలాలు రైతుల కళ్ళెదుట కనపడి తీరాలని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో ఉద్యాన పంటలవైపు ఆశతో ఉన్న రైతులు తాజా పరిణామాలతో ఒకింత సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

అన్నింటిలో ముందుండాలి

జిల్లాను అన్ని రంగాల్లోనూ ముందుంచాలని రాష్ట్ర ప్రభుత్వం యంత్రాంగాన్ని ఆదేశించింది. ప్రభుత్వ విభాగాల్లో జరుగుతున్న కార్యాచరణలు, తీసుకుంటున్న చర్యలన్నింటినీ ఆసాంతం గమనిస్తోంది. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు కాక మునుపే తాము ప్రజలకు ఇచ్చిన హామీల్లో అనేకం పూర్తి చేస్తుండగా జిల్లాస్థాయిల్లో ప్రజల కళ్ళెదుట అభివృద్ధి, సంక్షేమం కనిపించాలన్నది ప్రభుత్వం యోచన. ఇప్పటికే ఉచిత ఇసుక విధానం కింద రెండు వేల మెట్రిక్ టన్నులను వినియోగదారులకు అందించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇల్లు నిర్మించుకుని బిల్లులు రాని వారిని గుర్తించి వారికి బకాయిలు చెల్లించాలని సంకల్పించారు. ఈ మేరకు గృహ నిర్మాణ శాఖ నియోజకవర్గాల వారీగా ఈ తరహా లబ్ధిదారుల సంఖ్య ఏ రీతిలో ఉంది, వాటికయ్యే వ్యయం ఇతర వివరాలను నివేదికల రూపంలో రాబడుతోంది. టిడ్కో ఇళ్ళను పేద ప్రజలకు అందించేందుకు ఒక ముహూర్తం ఖరారు కావాల్సి ఉంది. ఇలా లక్ష్యాలు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా ప్రత్యక్షంగా కనపడేలా జాగ్రత్తలు పడుతున్నారు. జిల్లా యంత్రాంగం ఎన్నడూ లేని విధంగా వివిధ రంగాలపై సుదీర్ఘ సమీక్షలు, ఆకస్మిక తనిఖీలకు దిగింది.

సీడ్.. సిరులు

కాసులు కురిపిస్తున్న చేప పిల్లల వ్యాపారం

- కైకలూరులో 50 వేల మందికి ఉపాధి
- ఏటా ఎనిమిది లక్షల టన్నుల సీడ్ ఉత్పత్తి
- ప్రభుత్వానికి రూ.30 వేల కోట్ల ఆదాయం



నాణ్యమైన చేప పిల్లలు (సీడ్)కు పెట్టింది పేరు కొల్లేరు. వివిధ రాష్ట్రాల నుంచి రైతులు ఏటా కైకలూరు వచ్చి చేప పిల్లలను కొనుగోలు చేస్తుంటారు. స్థానిక రైతులు కొందరు ఇతర రాష్ట్రాలకు తీసుకువెళ్లి విక్రయిస్తారు. దీనితో రైతులకు, సీడ్ సరఫరా చేసే వారికే కాదు.. ప్రభుత్వానికి వేల కోట్ల ఆదాయం లభిస్తోంది.

కైకలూరు, ఆగస్టు 20 : దేశంలోని వివిధ రాష్ట్రాలకు కైకలూరు నుంచి ఏటా చేప పిల్లల రవాణా పెద్ద ఎత్తున సాగుతోంది. వివిధ సైజులను బట్టి రైతు వద్ద కొనుగోలు చేస్తుంటారు. నీటి కొరత ఉన్నప్పటికీ ఇటీవల కురిసిన వర్షాలకు వ్యాపారం ఊపందుకుంది. ఉమ్మడి కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఏటా 15 లక్షల టన్నుల చేపల ఉత్పత్తి జరుగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా 5.50 లక్షల ఎకరాల్లో చేపల సాగు చేస్తున్నారు. వీటి ద్వారా ప్రభుత్వానికి ఏటా రూ.30 వేల కోట్ల ఆదాయం సమకూరుతోంది. చేప పిల్లలను రిజర్వాయర్లు, ఇరిగేషన్ చెరువుల్లో విడిచి పెట్టేందుకు నేషనల్ ఫిషరీస్ డెవలెప్‌మెంట్ బోర్డు (ఎన్ఎఫ్‌డిబి) రాష్ట్రీయ కృషి విజ్ఞాన యోజన(ఆర్‌కేవీవై) సీడ్ ఉత్ప త్తులకు పలు రాయితీలను కల్పిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఒక్క రూపాయి కేటాయించకపోవడంతో ఆంధ్రాలోని డ్యామ్‌లలో చేప పిల్లలు వదిలిన దాఖలాలు లేవు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రభుత్వాలు మత్స్య ఉత్పత్తులపై ప్రత్యేక దృష్టి సారించడంతో వందల కోట్లు ఏటా కేటాయించి ఆయా రాష్ట్రాల్లో చేపల పెంపకాన్ని ప్రోత్సహిస్తూ వస్తున్నాయి. ఒక్క తెలంగాణకే ఏటా సుమారు 70 కోట్లపైన చేప పిల్లలు ఆంధ్ర నుంచి రవాణా జరుగుతోంది. ఇందులో అత్యధికంగా కైకలూరు కొల్లేరు ప్రాంతం నుంచే చేపపిల్లల రవాణా చేయడంలో మొదటి స్థానంలో ఉంది.



ఇతర రాష్ట్రాలకు రవాణా

కైకలూరు ప్రాంతం నుంచి ఏటా తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, కేరళ, తెలంగాణ రాష్ట్రాలకు వ్యాన్‌ల ద్వారా సీడ్‌ను రవాణా చేస్తుంటారు. ఒక వ్యానులో 10 సింటెక్స్ ట్యాంకులను ఏర్పాటు చేస్తారు. ఒక్కొక్క డ్రమ్ముకు 40-50 వేలు ఆయా సైజుల ను బట్టీ చేప పిల్లలను తీసుకువెళతారు. కొల్లేరు పరిసర ప్రాంతాల్లో ఎనిమిది వేల ఎకరాల్లో సీడ్ పెంచుతారు. 50 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సీడ్ పిల్లల పరిశ్రమ ద్వారా ఉపాధి పొందుతున్నారు. చేప పిల్లల పట్టుబడి నుంచి రవాణా అయ్యే వరకు కూలీలు పనులు చేస్తుంటారు.

సీడ్ ఉత్పత్తిలోనూ అగ్రగామి

కొల్లేరులో చేపలు సాగు చేసే విధానంలో రైతులు పాటిస్తున్న యాజమాన్య పద్ధతులు అపారమైన అనుభవాన్ని చూపుతూ ఉంటాయి. నాణ్యమైన సీడ్ ఉత్పత్తిని ఎంపిక చేసుకుంటారు. కట్ల(బొచ్చె), రోహు (శీలావతి), మిరగల్ (మోసు), గ్రాస్‌కార్ప్ (గడ్డి చేప), బంగారు తీగ, ఇతర రాష్ట్రాలకు భారీ ఎత్తున ఎగుమతులవుతుంటాయి. చేప పిల్లలను విక్రయాల్లో ప్రస్తుతం రెండు నుండు మూడు అంగుళాలు సైజు వున్న చేప పిల్లలకు డిమాండ్ ఎక్కువ. అంగుళం సైజు గడ్డి చేప అర్ధ రూపాయి, శీలావతి 30 పైసలు, కట్ల అర్ధ రూపాయి, బంగారుతీగ 60 పైసలు, మోసు 30 పైసలు ధర పలుకుతున్నాయి. వీటికి ఎక్కువగా డిమాండ్ ఉంటుంది. వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు చేపపిల్లల సంతానోత్పత్తికి అనుకూలం. ఈ ఏడాది దేశవ్యాప్తంగా భారీగా వర్షాలు కురవడంతో డ్యామ్‌లు నీటితో కళకళలాడడంతో వీటికి డిమాండ్ మరింత పెరిగింది. చేప పిల్లల పట్టుబడులకు ఆడ, మగ పనులకు వెళుతుంటారు. 'ప్రభుత్వం ఏటా కాలువల ద్వారా నీటినందిస్తే సీడ్ ఉత్పత్తులను ఎక్కువగా పెంచే అవకాశం కలుగుతుంది' అని సీడ్ వ్యాపారి బి.దుర్గారావు చెబుతున్నారు. తీపి నీటితో పిల్ల ఆరోగ్య వంతంగా పెరిగి వ్యాధులను తట్టుకుంటుందన్నారు. కైకలూరు మండల వ్యవసాయాధికారిణి ఎం.భవిత మాట్లాడుతూ రైతులు మంచి హేచరీలను గుర్తించి నాణ్యత కల్గిన చేప పిల్లలను ఎంపిక చేసుకోవాలి. ఉమ్మడి పశ్చిమ, కృష్ణా జిల్లాల్లో సీడ్ రవాణా అధికం. రైతులు సాగులో మెలకవులు పాటిస్తే చేప పిల్ల ఆరోగ్యవంతంగా పెరుగుతుంది' అని అన్నారు.



వేధిస్తున్న నీటి కొరత

ఏటా జూన్‌లో కాలువల ద్వారా నీటి సరఫరా జరగకపోవడంతో స్థానికంగా వున్న చెరువుల్లో నీరు చిక్కబడి సీడ్ ఉత్పత్తి దెబ్బతింటున్నది. హేచరీల నుంచి కొనుగోలు చేసిన సీడ్‌ను చెరువుల్లో వేసే సమయంలో తీపి నీరుంటేనే వేసిన చేపపిల్లలు ఆరోగ్యవంతంగా పెరుగుతాయి. చిక్కబడిన నీటి వల్ల వ్యాధుల బారిన పడడమే గాక చనిపోతాయి. ప్రభుత్వం చేపల సీడ్ ఉత్పత్తులు పెంచేందుకు తీపి నీటిని అందించాలని రైతులు కోరుతున్నారు.

ముగిసిన సర్దుబాటు

» డివిజన్ స్థాయి కౌన్సెలింగ్ పూర్తయ్యాకే సర్‌ప్లస్ ఎస్జీటీల అడ్జస్ట్‌మెంట్

ఏలూరు అర్బన్, ఆగస్టు 20 : సర్‌ప్లస్ టీచర్ల వర్క్ అడ్జస్ట్‌మెంట్‌లో భాగంగా తొలుత చేపట్టిన స్కూల్ అసిస్టెంట్ సబ్జెక్టు టీచర్ల మండల స్థాయి సర్దుబాటు కౌన్సెలింగ్ మంగళవారం ముగిసింది. సీనియార్టీ జాబితాల్లో స్వల్ప లోపాలు తలెత్తడంతో వాటిని సరిదిద్దేందుకు వీలుగా నూజివీడు, కొయ్యలగూడెం మండలాల్లో బుధవారానికి కౌన్సెలింగ్‌ను వాయిదా వేశారు. ఇప్పటి వరకు అందిన సమాచారం ప్రకారం మండల స్థాయి కౌన్సెలింగ్‌లోనే దాదాపు 90 శాతం సర్‌ప్లస్ స్కూల్ అసిస్టెంట్ల సర్దుబాటు పూర్తయింది. మండలస్థాయిలో సర్దుబాటుకు అవకాశం లేక డివిజన్ స్థాయికి చేర్చిన స్కూల్ అసిస్టెంట్లను కొరతవున్న ఆయా మండలాలకు అడ్జస్ట్ చేసేందుకు కౌన్సెలింగ్ ఎపుడు నిర్వహించాలో ప్రభుత్వం ప్రకటించాల్సి ఉంది. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత సర్‌ప్లస్ ఎస్జీటీల నుంచి బీఈడీ విద్యార్హతలు, మెథడాలజీ ప్రామాణికంగా ఆయా సబ్జెక్టులకు అవసరమైన సంఖ్యలో స్కూల్ అసిస్టెంట్లుగా భర్తీ చేస్తారు. ఆ ప్రకారం ముందుగా స్కూల్ అసిస్టెంట్ల కొరతను భర్తీ చేసి, ఆ తర్వాతే పూర్తిస్థాయిలో ఎస్జీటీల సర్దుబాటు చేస్తారు. కౌన్సెలింగ్‌లో నూతన స్థానాలకు సర్దుబాటు ఆప్షన్లు ఇచ్చిన ఉపాధ్యాయులందరూ సంబంధిత పాఠశాలల్లో తాత్కాలిక విధులు చేపట్టేందుకు అందరికీ కలిపి కామన్‌గా ఒకే జాయినింగ్ ఆర్డర్‌ను జారీ చేయనున్నారు. దీనికి మరో పది రోజుల వ్యవధి పట్టే అవకాశాలు వున్నాయి.

రేవు బకాయి వసూలుకు ఆర్‌ఆర్ యాక్టు

నరసాపురం, ఆగస్టు 20: ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూలై 2 వరకు మాధవాయిపాలెం రేవు కాంట్రాక్ట్ నిర్వహించిన రెడ్డప్ప ధవేజీ మండల పరిషత్‌కు రూ.53 లక్షలు చెల్లించాల్సి ఉంది. దీని వసూలుకు అప్పటి ఎంపీడీవో రమణరావు ఎనిమిదిసార్లు నోటీసులు జారీ చేసినా స్పందన లేదు. ఈ నేపథ్యంలో ఎంపీడీవో ఆత్మహత్య కలకలం రేపింది. అయినప్పటికీ నేటికి బాకీ వసూలు కాలేదు. ఇప్పటికే హైకోర్టును ఆశ్రయించిన మండల పరిషత్ అధికారులు తాజాగా ఆర్‌ఆర్ యాక్టు(రెవెన్యూ రికవరీ యాక్టు) ప్రకారం బకాయిదారుడు నుంచి వసూలుకు జిల్లా కలెక్టర్‌ను అనుమతి కోరారు. రాగానే ఈ చట్టాన్ని ప్రయోగించి పెండింగ్ బకాయిని వసూలు చేస్తామని ఇన్‌చార్జి ఎంపీడీవో వీరభద్రరావు చెప్పారు.

డిగ్రీ రెండో విడత అడ్మిషన్ల రిజిస్ట్రేషన్ గడువు పొడిగింపు

ఏలూరు అర్బన్, ఆగస్టు 20 : ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో ప్రథమ సంవత్సరం కోర్సుల్లో రెండో విడత ప్రవేశాలకు రిజిస్ట్రేషన్ గడువును ఈ నెల 24 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయని కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గిరిబాబు ఓ ప్రకటనలో తెలిపారు.

నేటి నుంచి తరగతులు

నూజివీడు టౌన్ : నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో బుధవారం నుంచి తరగతులు ప్రారంభిస్తున్నట్లు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఎస్.చంద్రశేఖర్ తెలిపారు. వెయ్యి సీట్లకు 961 మంది రెండు విడతల కౌన్సెలింగ్‌లో అడ్మిషన్లు పొందిన వారంతా మంగళవారం రిపోర్టు చేశారన్నారు.

బోటింగ్ ప్రమాదాల నివారణకు చర్యలు

పేరంటాలపల్లి వద్ద మినీ కంట్రోల్ రూమ్ ఏర్పాటు : కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి):గోదావరి నదీ పరివాహక ప్రాంతంలో బోటు ప్రమాదాల నివారణలో నిర్వాహకులు, ప్రయాణీకులు, పర్యవేక్షించే అధికారుల పాత్ర ఎంతో కీలకమని జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి అన్నారు. బోటింగ్ ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా సోమవారం రెవెన్యూ, పర్యాటక, బోటింగ్, అగ్నిమాపక, పోలీస్, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులతో కలెక్టర్ జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. పోలవరం పాపికొండలు, బోటింగ్ విభాగానికి సంబంధించిన అధికారులతో సమీక్షించారు. పాపికొండల ప్రాంతంలో విహార యాత్రాస్థలంగా ప్రసిద్ధిగాంచిన పేరంటాలపల్లి వద్ద మినీ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటుచేసి రెవెన్యూ, ఇరిగేషన్, పోలీస్, పర్యాటక శాఖల నుంచి వివిధ కేటగిరిలో సిబ్బందిని నియమించాలని ఆదేశించారు. బోటింగ్ ప్రమాదాలను నివారించేందుకు అవసరమైన ఎక్విప్‌మెంట్‌ను టూరిజం, రెవెన్యూ ఏర్పాటు చేయాలన్నారు. పర్యాటకులు అధికంగా వచ్చే సమయంలో అవసరమైన భద్రతా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. జంగారెడ్డిగూడెం ఆర్డీవో కె.అద్దయ్య, డీఎస్పీ సురేష్‌కుమార్‌రెడ్డి, పర్యాటక శాఖ(బోటింగ్) అసిస్టెంట్ మేనేజర్ గంగబాబు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



విద్యార్థితో కలెక్టర్

హాస్టల్ విద్యార్థులకు పాఠాలు చెప్పి..

ఏలూరు టూ టౌన్ : ప్రభుత్వ వసతి గృహ విద్యార్థుల ఆరోగ్యం, ఆహారం, చదువు పట్ల శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. శనివారపుపేట ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని మంగళవారం సందర్శించారు. విద్యార్థులకు పాఠాలు చెప్పి, వారిని పలు ప్రశ్నలు అడిగారు. హాస్టల్ పరిసరాలు వంట గది, భోజనశాల, మరుగుదొడ్లు, ఆటస్థలాన్ని పరిశీలించారు. డీఈఓ అబ్రహాం, వసతి గృహం సూపరిండెంటెండ్ శ్రీవల్లి తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలపై..

ఏలూరు అర్బన్ : ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికల నిర్వహణలో భాగంగా మంగళవారం ఏలూరులో కలెక్టర్ వెట్రిసెల్వి ఓటర్ల నమోదుపై ఎంఈవోలు, ఎంపీడీవోలు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నూతన ఉపాధ్యాయ ఓటర్ల నమోదుకు ఫారం-19ని సమర్పించడానికి సెప్టెంబరు 3 వరకు గడువు ఉందని, ఓటర్ల జాబితాపై క్లెయింలు, అభ్యంతరాలు దాఖలు చేసేందుకు సెప్టెంబరు 24 నుంచి అక్టోబరు 15 వరకు అవకాశం ఉందన్నారు. అక్టోబరు 30లోగా వాటిని పరిష్కరించి, నవంబరు 6న తుది ఓటర్ల జాబితాను ప్రచురిస్తారని వివరించారు.

పోలవరంలో కుండపోత

ఏడుచోట్ల గండ్లు.. పంట పొలాల్లో ఇసుక మేటలు

పోలవరం, ఆగస్టు 20 : పోలవరం మండలంలో సోమవారం రాత్రి భారీ వర్షం కురవడంతో పలుచోట్ల కొండవాగులు పొంగి ప్రవహించాయి. ఇటుకలకోట ఇసుక కాలువకు ఏడుచోట్ల గండ్లు పడి పంట పొలాలు నీట మునిగాయి. 50 ఎకరాల పొలాల్లో ఇసుక మేటలు వేసింది. మినుము, వరి పొలాలు మునిగి ఇసుక మేటలు వేయడంతో నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ శాఖల అధికారులు ఇసుక మేటలను పరిశీలించారు. రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కొండవాగుల దాటికి తానాలకుంట కల్వర్టు కొట్టుకుపోయింది. ఇటుకలకోట మీదుగా రేపల్లెవాడ దొండపూడి మీదుగా జంగారెడ్డిగూడెం వెళ్ళే ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. గుంజవరం, కొవ్వాడ కాలువ, జిల్లెల్లగూడెం కాలువలు పొంగి ప్రవహించాయి. కొవ్వాడ కాలువ, కొండవాగుల జలాలు పట్టిసీమ అవుట్ ఫాల్ స్లూయిజ్ ద్వారా గోదావరిలోకి ప్రవహిస్తున్నాయి. పోలవరం నుంచి తహశీల్దారు కార్యాలయానికి వెళ్ళే రోడ్డు మార్గంలో పంట పొలాల్లోకి కొండ వాగుల నీరు చేరింది. మోకాలి లోతు నీళ్లలోనే కూలీలు నాట్లు వేశారు.



ఇసుక మేట


ద్వారకాతిరుమలలో కళ్యాణ మండపం

అమ్మో..22వ తారీఖా..!

కల్యాణ మండపాలు, సత్రాలు ఫుల్..
పురోహితులు, భజంత్రీలు, కేటరింగ్ అందరికీ డిమాండ్
గురు, శుక్రవారాల్లో మంచి ముహూర్తాలు

ద్వారకాతిరుమల, ఆగస్టు 20: అమ్మో.. 22వ తారీఖా.. అసలు ఖాళీ లేదు.. కల్యాణ మండపాల యజమానులు, పురోహితులు, బాజా భజంత్రీలు, కేటరింగ్, పెళ్లి సామగ్రి సప్లై చేసేవారి నోట వినిపిస్తున్న మాట ఇదే.. ఆ రోజు మావల్ల కాదంటూ చేతులెత్తేస్తున్నారు. ఈనెల 22న బలమైన ముహూర్తం ఉంది. ఆరోజు జిల్లా వ్యాప్తంగా వేలాది పెళ్లిళ్లు జరుగుతాయని పురోహితులు చెబుతున్నారు. గురు, శుక్ర, శనివారాల్లో మంచి ముహూర్తాలుండటంతో వందలాది పెళ్లిళ్లకు ద్వారకాతిరుమల క్షేత్రం వేదికగా మారనుంది. ఈ క్రమంలో గురువారం రాత్రి గం. 10-30, తెల్లవారుజామున గం.2.47ని.లకు, 3.43, ని.లకు మంచి ముహూర్తాలు ఉన్నట్లు పండితులు గోవిందవఝుల వెంకట రమణమూర్తి శర్మ తెలిపారు. అలాగే శుక్రవారం రాత్రి రేవతి, అశ్వని నక్షత్రాల్లో 10.24 నిమిషాలకు, తెల్లవారు జామున 3.43 ని.లకు మంచి ముహూర్తాలు ఉన్నాయి. దీంతో క్షేత్రంలో అన్ని కల్యాణ మండపాలు, రూములు, సత్రాలు నెలక్రితమే బుక్ అయిపోయాయి. గురువారం రాత్రి పెద్ద ముహూర్తం కావడంతో ఆలయ పరిసరాల్లో భారీగా పెళ్లిళ్లు జరుగనున్నాయి.

ఈ ముహూర్తాలు అత్యంత బలమైనవి



ఈనెల 22వ తేదీన ఉన్న మూడు ముహూర్తాలు అత్యంత బలమైనవి. ఉత్తరాభాద్ర, రేవతి నక్షత్రాలు ఉండటం వల్ల ఆయా ముహూర్తాల్లో ఎన్నో జంటలు మూడుముళ్ల బంధంతో ఒక్కటి కానున్నారు. ఈ మాసంలో ఈనెల 28న ముహూర్తం ఉంది. తర్వాత మరో నెల వరకూ ముహూర్తాలు లేవు.

గోవిందవఝుల వెంకట రమణమూర్తి శర్మ, ద్వారకాతిరుమల

11 మంది ఎస్‌ఐలు, ఇద్దరు సీఐల బదిలీ

ఏలూరు క్రైం, ఆగస్టు 20 :జిల్లాలో పనిచేస్తున్న ఎస్‌ఐలలో 11 మందిని పరిపాలనా సౌలభ్యంలో భాగంగా బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ కిషోర్ ఉత్తర్వులు జారీ చేశారు. చేబ్రోలు ఎస్‌ఐ ఆకుల మణికుమార్‌ను గణపవరం ఎస్‌ఐగా నియమించారు. అక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ వెంకటేశ్వరరావును ఏలూరు వీఆర్‌లో ఉంచారు. ఏలూరు వీఆర్‌లో ఉన్న ఎస్‌ఐ షేక్ జబీర్‌ను జంగారెడ్డిగూడెం ఎస్‌ఐగా,అక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ జ్యోతిబసును ఏలూరు వీఆర్‌లో ఉంచారు. ధర్మాజీగూడెం ఎస్‌ఐ చెన్నారావును తడికలపూడి ఎస్‌ఐగా నియమించగా బుట్టాయిగూడెం ఎస్‌ఐ వెంకన్నను ధర్మాజీగూడేనికి నియమించారు. ఏలూరు వన్‌టౌన్ ఎస్‌ఐ నవీన్‌కుమార్‌ను జీలుగుమిల్లికి, ఏలూరు వీఆర్‌లో ఉన్న దుర్గా మహేశ్వరరావును బుట్టాయి గూడేనికి బదిలీ చేశారు. ఏలూరు టూటౌన్ ఎస్‌ఐ షేక్ మదీనా బాషాను ఏలూరు వన్‌టౌన్ ఎస్‌ఐగా నియమించారు. పెదపాడు ఎస్‌ఐ శుభశేఖర్‌ను ఆగిరిపల్లికి బదిలీ చేయగా ఆగిరిపల్లి ఎస్‌ఐ సురేంద్రకుమార్‌ను ఏలూరు వీఆర్‌లో ఉంచారు. ఇద్దరు సీఐలను బదిలీ చేస్తూ ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏలూరు రేంజ్ వీఆర్‌లో ఉన్న రమేష్‌బాబును కుక్కునూరు సీఐగా నియమించగా అక్కడ పనిచేస్తున్న శ్రీనివాసరావును ఏలూరు రేంజ్ వీఆర్‌లో ఉంచారు. భీమవరం జిల్లా దిశ పోలీస్ స్టేషన్ డీఎస్పీ ఎస్.మురళీకృష్ణను విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కి బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

పోలవరం దస్త్రాల దహనంపై కేంద్రం సీరియస్

కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ



భీమవరం టౌన్, ఆగస్టు 20 : పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన దస్త్రాలు తగలబడిన సంఘటనపై కేంద్ర ప్రభుత్వం చాలా సీరియస్‌గా ఉందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. మంగళవారం భీమవరంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు అథారిటీ కూడా చాలా సీరియస్‌గా తీసుకుందన్నారు. ఖచ్చితంగా సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవడమే కాకుండా, తగలబడిన దస్త్రాలు వెనుక ఉన్న కథ ఏమిటి అన్న విషయాన్ని బయటకు లాగుతామన్నారు. విశాఖ రైల్వే జోన్ గతంలోనే ప్రకటన చేయడం జరిగిందని దీనికి సంబంధించి గత ప్రభుత్వం భూములు కేటాయింపు సరిగా చేయ లేదన్నారు. అందువల్లే ఆలస్యం అయ్యిందని ఇప్పుడు ముందుకు వెళ్ళే పరిస్థితి ఉందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ఉన్నతాధికారులు స్వాతంత్య్ర దినోత్సవం నాడు సినిమా పాటలకు డ్యాన్స్ చేశారనే విషయం తన దృష్టి రాలేదని ఆ వీడియో పరిశీలించి అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు.


శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు, శాస్త్రవేత్తలు

యువత వ్యాపారాభివృద్ధిపై దృష్టి సారించాలి

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 20: పూలు, కూరగాయలు, పండ్లకు విలువ జోడించి మార్కెటింగ్ చేసుకునే దిశగా యువతను ప్రోత్సహించడమే లక్ష్యంగా శిక్షణ ఉపయోగపడాలని ఉద్యాన విశ్వవిద్యాలయ విస్తరణ సంచాలకులు కరుణశ్రీ అన్నారు. తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెం కృషి విజ్ఞాన కేంద్రంలో 15 రోజులుగా నాబార్డ్, ఉద్యాన విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న సూక్ష్మ వ్యాపార అభివృద్ధిపై శిక్షణా కార్యక్రమాలు మంగళవారంతో ముగిశాయి. కరుణశ్రీ మాట్లాడుతూ మహిళలు స్వయం సహాయక బృందాలుగా ఏర్పడి ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకోవాలని సూచించారు. జిల్లా అభివృద్ధి మేనేజర్ అనిల్‌కాంత్, శాస్త్రవేత్తలు దీప్తి, దేవి వరప్రసాద్‌రెడ్డి, కె.వెంకట సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వెరైటీ శుభలేక

ప్రశ్నపత్రంలా ఆహ్వానపత్రిక





పెనుమంట్ర, ఆగస్టు 20 : పెనుమంట్ర మండలం మార్టేరుకు చెందిన వధువుకు తన పెళ్లి పత్రిక విభిన్నంగా ముద్రించి అందిరినీ ఆకట్టుకుంది. తన పెళ్లి పత్రికలో ఎనిమిది ప్రశ్నల రూపంలో పెళ్లి ఆహ్వాన పత్రిక సమగ్ర సమా చారాన్ని పొందు పరిచారు. సింగిల్ ఆన్సర్ ప్రశ్నలు, మల్టిఫుల్ చాయిస్ ప్రశలు, ట్రు ఆర్ ఫాల్స్ ఇలా వివిధ ప్రశ్నల రూపంలో పెళ్లికి సంబంధించిన సమా చారాన్ని ఇవ్వడంతో పాటు నూటికి నూరు మార్కులు వచ్చినట్టుగా ముద్రిం చారు. వరుడు విశాఖపట్నంకి చెందిన ఫణేంద్ర అదానీ గ్రూప్ ఆఫ్ కంపెనీ మెకానికల్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. మార్టేరుకు చెందిన వధువు ప్రత్యూష విశాఖపట్నంలో ప్రైడా కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నది. ఆమెకు ఈనెల 23న వివాహం. వధూవరులు, కన్యా దాతలు పేర్లు, పెళ్లి తేదీ, సమయం, కల్యాణ మండపం, విందుకు సంబంధించి ప్రశ్నలకు సమాధానంతో పెళ్లి ఆహ్వాన పత్రికను తీర్చిదిద్దారు. ఈ పెళ్లి శుభలేఖను బంధువులకు మిత్రులకు పంచారు. పలువురు ఆసక్తిగా చదివి అభినందించారు. అధ్యాపక వృత్తిలో ఉన్న తనకు తన వృత్తిని ప్రతిబింబించే విధంగా ఆహ్వాన పత్రికను అందించాలనే ఆలోచనతో ఇలా వినూత్నంగా ముద్రించినట్టు వధువు ప్రత్యూష 'ఆంధ్రజ్యోతి'కి తెలియజేసింది.

ఆంధ్రజ్యోతి పరిశీలన

జగనన్న కాలనీల్లో నివసిస్తున్న లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. సరైన వసతులు కల్పించకుండానే ఇళ్ల కట్టుకోవాలంటూ ఒత్తిడి చేశారు.. లేదంటే స్థలం వెనక్కు తీసుకుంటామని బెదిరించడంతో అప్పో సప్పో చేసి ఇళ్లు కట్టుకుని ఇళ్లల్లోకి వెళ్లిపోయారు. తీరా చూస్తే సరైన రోడ్లు లేవు.. డ్రెయినేజీ సదుపాయం లేదు.. కొన్ని చోట్ల వీధిలైట్లు కూడా ఏర్పాటు చేయలేదు.. వెళ్లిన వారంతా నరకం చూస్తున్నారు. వర్షాకాలం కావడంతో పూడిక చేయక పోవడంతో కాలనీలు చెరువుల్లా మారుతున్నాయి.. ఖాళీ స్థల్లాలో పిచ్చి మొక్కలు పెరిగిపోయి చిట్టడవిలా తయారయ్యాయి. విష సర్పాలు ఇళ్లలోకి వచ్చేస్తున్నాయి. ఎవరితో చెప్పుకోవాలో తెలియక నరకయాతన అనుభవిస్తున్నారు.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కొన్ని జగనన్న కాలనీలను 'ఆంధ్రజ్యోతి' పరిశీలించింది.. అవి ఎలా ఉన్నాయంటే..


పెంటపాడు మండలం పరిమెళ్లలో జగనన్న కాలనీ రహదారి నీటితో మునిగిపోవడంతో రాళ్లు అమర్చుకున్న లబ్ధిదారులు

జగనన్న ఇళ్లకు దారేది ?

అసౌకర్యాలకు నిలయంగా జగనన్న కాలనీలు
రహదారులు, డ్రైనేజీలు లేక ఇబ్బందులు
వర్షం వస్తే చెరువులవుతున్నాయి
ఇళ్లల్లోకి చేరుతున్న విష సర్పాలు
మురుగునీటి నిల్వతో విజృంభిస్తున్న దోమలు
భయంతో జీవనం సాగిస్తున్న లబ్ధిదారులు


కాళ్లలో పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో పాములు చేరుతున్న దృశ్యం

చిట్టడవిలా కాలనీలు

కాళ్ళ : మండలంలో 20 లేఅవుట్లో సుమారు 1981 మంది లబ్ధిదారులకు ఇళ్ళ స్థలాలు కేటాయించారు. వీటిలో దొడ్డనపూడి, పల్లిపాలెం, కోపల్లె గ్రామాల్లోని లేఅవుట్‌లు కోర్టు వివాదాల కారణంగా పట్టాలు పంపిణీ కార్యక్రమం నిలుపుదల చేశారు. మిగిలిన 17 లేఅవుట్‌లలో 1821 మందికి వేంపాడు, కోపల్లె, బొండాడ పేట, కాళ్ళ, కోలనపల్లి, ఏలూరుపాడు గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. వీధిలైట్లు, సౌకర్యాలు లేకపోవడంతో లబ్ధిదారులు ముందుకు రావడం లేదు. కొన్ని గ్రామాల్లో వేసిన లేఅవుట్‌లకు సరైన మార్గం లేక వాటిలో పిచ్చిమొక్కలు, తుమ్మచెట్లు మొలచి చిట్టడివిని తలపిస్తున్నాయి. వర్షాకాలం కావడంతో విషసర్పాలు భయపెడుతున్నాయి.

పట్టా ఇచ్చారు..స్థలం ఏదీ : మహాలక్ష్మి, పెదఅమిరం

మా గ్రామానికి సుమారు 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న కోలనపల్లి గ్రామంలో స్థలం కేటాయించారు. తీరా అక్కడికి వెళ్ళి చూస్తే సుమారు 9 ఎకరాలు విస్తీర్ణంలో ఉన్న లేఅవుట్లో నాకు కేటాయించిన ప్లాట్ ఎక్కడుందో తెలియడం లేదు.

విష సర్పాల మధ్య జీవనం : గాదం నాగబాబు, కాళ్ళ



కాళ్ళలో జగనన్న కాలనీలో ఇల్లు కట్టుకుని మూడు నెలలు క్రితం వచ్చి నివసిస్తున్నాం. సరైన రోడ్డు మార్గం లేదు. వీధిలైట్లు అంతంత మాత్రమే. వర్షాకాలం కావడంతో కాలనీ అంతా పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. విషసర్పాలు ఇళ్లల్లోకి వచ్చి భయపెడుతున్నాయి. మా బాధలు ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదు.

అడుగు బయట పెట్టాలంటేనే భయం

ఆకివీడు రూరల్ : తాళ్ళకోడులో అడుగ బయట పెట్టాలంటేనే భయపడుతున్నారు. ప్రధాన రహదారులు రెండు మాత్రమే నిర్మించారు, అవి ఇప్పుడు పూర్తిగా గోతులమయం. మిగిలిన రహదారులైతే ఆనమాలు కూడా కనపడడం లేదు. నరకప్రాయంగా ఉందని ఇళ్ళు నిర్మించుకున్న లబ్ధిదారులు వాపోతున్నారు.డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు ఇళ్ళు నిర్మించుకోని స్థలాలలోనికి చేరుతున్నది. దీంతో దోమలకు ఆలవాలంగా మారిపోయింది. కనీసం కచ్చా డ్రైన్‌లు తవ్వించాలని లబ్ధిదారులు కోరుతున్నారు. తాగునీరు, ఉపయోగించు కునేందుకు నీటిని సరఫరా చేసేందుకు పూర్తిస్థాయి చర్యలు తీసుకోలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పాములు వచ్చేస్తున్నాయి..



తణుకు : పైడిపర్రు జగనన్న కాలనీలో కాలనీల్లో మౌళిక సదుపాయాలు లేక అక్కడ నివాసం ఉంటున్న కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడు తున్నారు. వర్షం వస్తే కాలనీ చెరువులా మారుతోంది. ఖాళీ స్థలాలు పిచ్చి మొక్కలతో నిండి పోయాయి. దీంతో విషసర్పాలు సరాసరి ఇళ్లల్లోకి వస్తున్నాయి. ఇటీవల వర్షాలకు విష సర్పాలు ఇంట్లోకి రావడంతో బెంబేలెత్తి పోయారు. రోడ్డు పూడ్చకపోవడం వల్ల నీరుతో నిండిపోతున్నాయి. తమను పట్టించుకునేవారే లేరని అక్కడ ఇళ్లు కట్టుకున్నవారు వాపోతున్నారు.

అప్పులు చేసి కట్టాం

పెంటపాడు : మండలంలోని పరిమెళ్లలోని కాలనీలో మౌళిక వసతులు, కనీస సదుపాయాలు లేకపోవడంతో చాలామంది ఇంటి నిర్మాణాలు చేసుకునేందుకు ముందుకు రాలేదు. స్థానిక వైసీపీ నాయకులు, అధికారులు ఇంటి నిర్మాణం చేపట్టకుంటే స్థలాన్ని వేరే వాళ్ళకు ఇచ్చేస్తామంటూ లబ్ధిదారులను భయపెట్టడంతో చేసేది లేక లబ్ధిదారులు ప్రభుత్వం ఇచ్చిన సొమ్ము కాకుండా ఒక్కో ఇంటికి సుమారు రూ.10 లక్షలకు పైగా వెచ్చించి ఇంటి నిర్మాణాలు చేసుకున్నారు. ఇప్పుడు కాలనీలో మౌలిక వసతుల కొరత లబ్ధిదారులకు ఇబ్బందిగా మారింది.

నడిచే మార్గం లేదు : జి.రత్నం, పరిమెళ్ళ



జగనన్నకాలనీలో స్థలం వచ్చింది. ఇల్లు కూడా నిర్మించుకున్నాం. ఇప్పటి వరుకూ కాలనీలో డ్రైనేజీ సదుపాయం లేదు. రహదారులు కూడా లేవు. వర్షం వస్తే కాలనీ మొత్తం మునిగి పోతుంది. నడిచే మార్గం లేక చిన్న పిల్లలతో చాలా ఇబ్బంది పడుతున్నాం. కాలనీలో రహదారులు, డ్రైనేజీలు నిర్మించాలి

బురదలో నడిచి వెళ్లాలి



భీమడోలు : మండలంలో జగనన్న కాలనీల పేరిట 2,050 మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయగా 1265 మంది ఇళ్లు నిర్మించుకున్నారు. ప్రధా నంగా భీమడోలు, గుండుగొలను, పూళ్ళ గ్రామాల కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భీమడోలు కాలనీలో నిర్మాణాలు చేపట్టని స్థలాలు చెరువులను తలపిస్తున్నాయి. రోడ్డు మార్గం లేక బురదలో నడ వాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. కనీసం తాగునీటి సౌకర్యం కూడా లేదు. గుండుగొలనులో రోడ్ల నిర్మాణాలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నీరు ఇవ్వండి : శ్రీనివాసరావు, భీమడోలు



భీమడోలు దిగుడు పాటిదిబ్బ ఇళ్ళ కాలనీలో సరైన నీటి సౌకర్యం లేదు. ఇబ్బందులు పడుతున్నాం. అలాగే ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేయాలి.

పునాదుల్లోనే నిలిచిపోయాయి



పెదపాడు : మండలంలోని జయపురంలో 44 మందికి ముప్పర్రు ప్రధాన రహదారి పక్కనే 47 ప్లాట్లు వేశారు. మొత్తం వ్యవహారంలో భారీ అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. నిర్మాణం ప్రారంభమైన 44 ఇళ్లలో ఒక్కటి పూర్తికాగా, మిగతా 43 ఇళ్ల పునాదుల చుట్టూ ముళ్లకంపలు, పిచ్చిమొక్కలు పెరిగిపోయి అడవిని తలపిస్తున్నాయి. ఇనుప చువ్వలు తుప్పుపట్టిపోయాయి.

నడిచేందుకు కూడా వీలు లేదు



దెందులూరు: నడవడానికి కూడా వీలులేని విధంగా ఉన్న జగనన్న కాలనీలో ఉండేదెలా అని పేదలు గగ్గోలు పెడుతున్నారు. వైసీపీ పాలనలో జగనన్న కాలనీ స్థలాల మెరక పేరుతో డబ్బులు వసూలు చేశారని పలు వురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో రోడ్లు కానీ, డ్రెయినేజీలు ఏర్పాటు చేయలేదు. చల్లచింతలపూడి కాలనీలో మోకాలి లోతు బురదలో విద్యార్థులు, కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గోపన్నపాలెం కాలనీలో మోటార్ సైకిల్స్ ట్రాక్టర్లు సైతం దిగబడిపోతున్నాయి.

పిల్లలు స్కూళ్లకు వెళ్లాలంటే అవస్థలు



ఉంగుటూరు : మండలంలో 40 కాలనీల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. 916 ఇళ్లు మంజూరు చేయగా 800 ఇళ్ల నిర్మాణం చేపట్టారు. 600 ఇళ్ల నిర్మాణం పూర్తయింది. చేబ్రోలు కాలనీ మినహా మిగతా చోట్ల అక్కడక్కడ నిర్మాణాలు సాగుతున్నాయి. పలు కాలనీల్లో రహదారులు, డ్రెయిన్ల సౌకర్యం లేదు. వర్షం పడితే బురదలో వెళ్లాల్సిందే. గృహ ప్రవేశం చేసిన చోట పిల్లలు స్కూళ్లకు వెళ్లాలంటేనే అవస్థలు పడుతున్నారు. ఉంగుటూరులో సర్పంచ్ బండారు సింధు రహదారుల్లో కంకర నింపడం కాస్త ఉపశమనం పొందుతున్నారు.

శిథిలావస్థకు చేరిన ఇళ్లు



జంగారెడ్డిగూడెం : పట్టణంలో జగనన్న కాలనీల్లో కాంట్రాక్టర్లు నిర్మించిన ఇళ్లు అప్పుడే శిథిలావస్థకు చేరుకున్నాయి. పునాదులు, మెట్లు, గచ్చు, ప్లాస్టింగ్, బాత్‌రూమ్ లేకుండా ఇళ్లను నిర్మించి కాంట్రాక్టర్లు బిల్లులు చేయిం చుకున్నారు. కాలనీల్లో కనీస సౌకర్యాలు లేవు. మొక్కుబడిగా నిర్మించిన ఇళ్లు పడిపోయే స్థితిలో ఉన్నాయి. నేలకు సమాంతరంగా ఇళ్ల నిర్మాణం చేప ట్టడంతో వర్షం పడితే బయట నీరంతా ఇంట్లో చేరుతోంది. పట్టణంలో ఐదు కాలనీల్లో 2097 మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరయ్యాయి. కేవలం 704 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి.

క్రైం కార్నర్

మొగల్తూరు జాతీయ రహదారిపై సినీ ఫక్కీలో దోపిడీ

మొగల్తూరు, ఆగస్టు 20: మొగల్తూరు జాతీయ రహదారిపై సోమవారం రాత్రి సినీఫక్కీలో దారిదోపిడీ జరిగింది. ఏఎస్‌ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన ముసునూరి దుర్గరాజు సోమవారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో జగన్నాథపురం నుంచి బైక్‌పై పాలకొల్లు వెళుతున్నాడు. మొగల్తూరు పంచాయతీ పరిధి కోతుల గుంట సమీపంలో జాతీయ రహదారిపై టాయ్‌లెట్‌కు వెళ్ళేందుకు బైక్ ఆపాడు. ఇది గుర్తించిన ఇరువురు వ్యక్తులు ఒకబైక్‌పై వచ్చి అతడిని వెంబడించి అతడిని అడ్డగించి జేబులో ఉన్న రూ.22 వేలు నగదు, సెల్ ఫోన్ తీసుకుని పరారయ్యారు. షాక్ అయిన దుర్గరాజు కొంత సేపటికి తేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గతంలో ఇటువంటి ఘటనలు జరిగిన దాఖలాలు లేవు. సుమారు ఏడాది కాలంగా ఈజాతీయ రహదారిపై పోలీస్ పెట్రోలింగ్ కూడా లేకపోవడంతో దోపిడీదారులకు అడ్డాగా కనిపిస్తోంది. జాతీయ రహదారిపై రాత్రి వేళల్లో విద్యుత్ సౌకర్యం కూడా పూర్తిస్థాయిలో లేకపోవడం, ట్రాఫిక్ పెరగడం నేపథ్యంలో హైవే పెట్రోలింగ్ పోలీసులు పర్యవేక్షణ పెంచాల్సి ఉంది.

తల్లి మందలించిందని బాలిక ఆత్మహత్య

జీలుగుమిల్లి, ఆగస్టు 20 :బాలిక ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వి.చంద్రశేఖర్ చెప్పారు. కామవరపుకోటకు చెందిన మామిడి మరియమ్మ కూతురు ఇంటర్ పూర్తయింది. పాములవారిగూడెంలో దుర్గాప్రసాద్ కోళ్లఫారం వద్ద కొంత కాలంగా కూలిపనుల నిమిత్తం వచ్చి ఉంటున్నారు. వారం రోజులుగా తన కూతురు తరచూ ఫోన్ చూస్తుండటం, చెప్పిన పనులు చేయకపోవడంతో సోమవారం రాత్రి తల్లి మందలించింది. దీంతో బాలిక మనస్తాపం చెందింది. కోళ్లకు ఇన్‌ఫెక్షన్ రాకుండా వాడే ఇంజక్షన్ తాగి ఆత్మహత్య చేసుకుంది. బాలికను జంగారెడ్డిగూడెం ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

జీవితంపై విరక్తితో ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్య

ఏలూరు క్రైం, ఆగస్టు 20 : ఆర్థిక పరిస్థితులు, కుటుంబ గొడవలు, మరో వైపు అనారోగ్యం.. దీంతో జీవితంపై విరక్తి చెందిన ఆర్టీసీ డ్రైవర్ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు ఎన్టీఆర్ కాలనీలో నివాసం ఉంటున్న కొప్పినీడి శరత్ శ్రీనివాస్ (42) ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. 15 సంవత్సరాల క్రితం అతనికి వివాహం అయింది. భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ కలహాలతో ఏడు సంవత్సరాల క్రితం విడాకులు తీసుకున్నారు. అప్పటి నుంచి ఒంటరిగా ఉంటూ మద్యానికి బానిసయ్యాడు. మానసికంగా ఇబ్బందులకు గురవుతూ అనారోగ్యం పాలయ్యాడు. దీంతో మూడు నెలల నుంచి మెడికల్ లీవు పెట్టాడు. ఒంటరిగా ఉంటున్న అతను సోమవారం రాత్రి పడుకున్నాడు. మంగళవారం మధ్యాహ్నం వరకు ఇంట్లో నుంచి బయటకు రాకపోయేటప్పటికి అతని సోదరుడు వెళ్ళి తలుపుకొట్టాడు. తలుపు తీయకపోవడంతో కిటికి వైపు చూడగా ఉరి వేసుకుని కనిపించాడు. దీంతో ఏలూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ రాజా రెడ్డి తన సిబ్బందితో వెళ్ళి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏలూరులో పదకొండు కాసుల బంగారం చోరీ

ఏలూరు క్రైం, ఆగస్టు 20 : ఇంటి తాళాలు పగులగొట్టి దొంగలు బంగారు ఆభరణాలు అపహరించారని ఏలూరు త్రి టౌన్ పోలీసులకు ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వట్లూరు గ్రామ పంచాయతీ పరిధిలోని ఇంద్రప్రస్థ హౌసింగ్ కాలనీలో చెట్టుపల్లి ప్రసాద్ తన కుటుంబంతో ఈనెల 17వ తేదీన బంధువుల ఇంట్లో జరిగే శుభకార్యానికి వెళ్లారు. తిరిగి మంగళవారం ఉదయం వచ్చేటప్పటికి దొంగలు ఆ ఇంటి తాళాలు పగుల గొట్టి ఇంట్లోని 11 కాసుల బంగారు ఆభరణాలు, 25 వేల రూపాయల నగదు, వెండి వస్తువులు అపహరించారు. దీనిపై ఏలూరు త్రిటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ కె.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని ఒకరి మృతి

ఏలూరు క్రైం, ఆగస్టు 20 : కుమారుని వద్దకు వచ్చి తిరిగి మోటారు సైకిల్‌పై వెళ్తుండగా ఎదురుగా వచ్చిన ఒక కారు ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. చింతలపూడి మండలం పట్టాయిగూడేనికి చెందిన తొమండ్రు లాజరు (51) ఏలూరు సమీపంలో ఉన్న వట్లూరులోని తమ కుమారుని వద్దకు మోటారు సైకిల్‌పై వచ్చాడు. తిరిగి మంగళవారం వెళ్తుండగా మార్గమధ్యలో దుగ్గిరాల బ్రిడ్జి వద్ద ఒక కారు ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురైన అతనిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అత్యవసరపు విభాగపు వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. ఈ సంఘటనపై ఏలూరు త్రి టౌన్ సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాస్త..చేయేస్తారా.. !

ఎర్రగుంటపల్లిలో నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు



చింతలపూడి,ఆగస్టు 20: కాలం చెల్లిన బస్సులతో ఇటు ఆర్టీసీ సిబ్బందికి, అటు ప్రయాణికులకు రక్షణ లేకుండా పోయింది. మంగళవారం ఏలూరుకు చెందిన రెండు ఆర్టీసీ బస్సులు చెడిపోయి నిలిచిపోయాయి. ఒకటి రామచంద్రపురం సమీపంలో మరొకటి ఎర్రగుంటపల్లి వద్ద చెడిపోయి నిలిచిపోయాయి. ఈ మార్గంలో ప్రతీరోజు ఏదోఒక చోట బస్సులు నినిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గంలో సగం తెలంగాణ సర్వీసులు నడుస్తున్నాయి. దీనివల్ల రాష్ట్ర సర్వీసు బస్సులు వచ్చేవరకు ఆగాలి. లేదా ఏ ఆటోనో ఆశ్రయించాలి. మహిళా ప్రయాణికులు, పిల్లలతో, లగేజీలతో ప్రయాణించేవారు ఇదేం ఖర్మరా అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళ బస్సులు నిలిచిపోతే పరిస్థితి ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బస్సులో బంగారు ఆభరణాల బ్యాగ్

డిపో మేనేజర్‌కు అప్పగించిన డ్రైవరు.. ప్రయాణికుడికి అందజేత



తణుకు, ఆగస్టు 20 : హైద్రాబాదు బీహెచ్ఈఎల్ నుంచి తణుకు వచ్చిన నైట్ రైడర్ బస్సులో పేర్ల ప్రదీప్ అనే ప్రయాణికుడు ఆరు లక్షల విలువైన బంగారు ఆభరణాలు ఉన్న బ్యాగ్ మర్చిపోయి విజయవాడలో దిగిపోయాడు. ఈ సంఘటన మంగళవారం జరిగింది. తణుకు వచ్చిన తర్వాత బస్సులో బ్యాగును గమనించిన డ్రైవర్లు యన్నం వెంకట గోపాలరావు, పెనుమత్స శ్రీనివాసరాజులు ఆ బ్యాగును తణుకు డిపో మేనేజర్ గిరిధర్‌కు అప్పగించారు. ప్రదీప్‌కు సమాచరం ఇవ్వడంతో తణుకు వచ్చి ఆ బ్యాగ్ తీసుకున్నాడు. డ్రైవర్లు నిజాయితీగా వ్యవహరించి సంస్థకు మంచి పేరు తీసుకువచ్చారని డీఎం అభినందించారు.

'కల్యాణ మండపానికి స్థలం ఎందుకు కేటాయించలేదు'


తహసీల్దారుతో చర్చిస్తున్న ఏలూరు ఎంపీ మహేష్‌కుమార్

ద్వారకాతిరుమల, ఆగస్టు 20: ఎన్నికల హామీ మేరకు నాయీ బ్రాహ్మణులకు ద్వారకాతిరుమలలో కల్యాణ మండప నిర్మాణానికి స్థలం కేటాయించాలని ఆదేశాలిచ్చామని అమలులో జాప్యం ఎందుకని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తహసీల్దారు జేవీ సుబ్బారావును ప్రశ్నించారు. ఎంపీ స్వగృహానికి తహసీల్దారును పిలిపించి కారణాలు అడిగి తెలుసుకున్నారు. స్థలం కేటాయిం పునకు రెవెన్యూ పరమైన అడ్డంకులు ఏమైనా ఉంటే వాటిని తన దృష్టికి తీసుకుని రావాలన్నారు. ఎన్నికల్లో తాను, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ఇచ్చిన హామీ ప్రకారం వారికి స్థలాన్ని కేటాయించాలని 20 రోజుల క్రితమే ఆదేశా లిచ్చినా అవి ఇంకా అమలు కాలేదన్నారు. వారం రోజుల్లో స్థలం కేటాయించాలని తహసీల్దారును ఆదేశించారు.

జూనియర్ కళాశాల విద్యార్థులకు కిట్లు పంపిణీ


కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రోషన్ కుమార్

చింతలపూడి, ఆగస్టు 20 : రాష్ట్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు రూ.10 కోట్ల వ్యయంతో నోటు, పాఠ్య పుస్తకాలు, బ్యాగు కలిపి కిట్లు పంపిణీ చేస్తున్నట్లు ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 321 మంది విద్యార్థులకు మంగళవారం కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ తీసుకున్న ఈ నిర్ణయం వల్ల ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు ఈ వెసులుబాటు కలిగిందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా కళాశాల కాంపౌండు వాల్, హాస్టల్ సమస్యలను విద్యార్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రిన్సిపాల్ హెచ్.శ్రీనివాస్, కూటమి నాయకులు పి.వెంకటేశ్వరరావు, సీహెచ్.ధర్మరాజు, టి.నాగవిజయకుమార్, కె.శేషగిరి రావు పాల్గొన్నారు.

విష్ణు వర్ధనరావు సేవలు ప్రశంసనీయం


సమావేశంలో మాట్లాడుతున్న అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్

ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 20 : విశ్రాంత డీఈ చందన విష్ణువర్ధన రావు సేవలు ప్రశంసనీయమని అవని గడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. పోలీస్ పరెడ్ గ్రౌండ్స్ ప్రాంగణంలో గల జిల్లా పోలీసు అధికారుల సంఘ కార్యాలయం వద్ద శాంతినగర్ కు చెందిన విశ్రాంత డీఈ విష్ణువర్ధనరావు రూ. రెండు లక్షలతో సమకూర్చిన 22 సైకిళ్ళు, పది కుట్టు మెషీన్లను విద్యార్థులకు, మహిళలకు ప్రతినిధుల ద్వారా మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, జనసేన జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పల నాయుడు, కూటమి నాయకులు ఎంఆర్‌డీ బలరాం, పులి శ్రీరాములు, నారా శేషు, దేవినేని భాస్క రరావు, తన్నీరు బుజ్జి, తదితర ప్రముఖులు పాల్గొన్నారు. విష్ణువర్ధనరావు ప్రతినిధులను దుశ్శాలువాతో సత్కరించారు. ఎంఈవో ఎస్.అబ్రహాం, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు పాల్గొన్నారు.

సబ్‌ప్లాన్ నిధులు సద్వినియోగం చేయండి

ఏలూరు టూ టౌన్, ఆగస్టు 20: ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను సక్రమంగా ఖర్చు చేయాలని రాష్ట్ర దళిత, గిరిజన బడ్జెట్ వాచ్ కన్వీనర్ అల్లాడి దేవకుమార్ డిమాండ్ చేశారు. కమిటీ సమావేశం జిల్లా కన్వీనర్ సింగవరపు జ్యోతి ఆధ్వర్యంలో లేడీస్ క్లబ్‌లో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా దేవకుమార్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ హాస్టల్‌లో మెస్ ఛార్జీలు పెరిగిన ధరలకు అనుగుణంగా పెంచాలన్నారు. సాయి బాబు, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

300 మందికి వైద్య పరీక్షలు

బుట్టాయగూడెం, ఆగస్టు 20 : గ్రామంలోని వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఏలూరు ఆశ్రం ఆస్పత్రి వైద్యులు విద్యా రోహిణి డిజిటల్ పాఠశాలలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 300 మందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వాసవీ క్లబ్ డిస్ట్రిక్ జోన్-3 గవర్నర్ కె.రామ్మోహనరావు, మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.సత్యనారాయణ, జి.మోహన్ సాయి చందీప్, కోశాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

విషజ్వరాలు ప్రభలకుండా చర్యలు తీసుకోండి

బుట్టాయగూడెం, ఆగస్టు 20 : ఏజెన్సీలో విషజ్వరాలు ప్రభలకుండా ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి తక్షణ చర్యలు చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య అన్నారు. బుట్టాయగూడెంలోని సీహెచ్‌సీని మంగళవారం ఆయన సందర్శించారు. సూపరింటెండెంట్ వసుంధరతో మాట్లాడి వైద్య సేవలు అడిగి తెలుసుకున్నారు. 108 వాహనంతోపాటు మరో అంబులెన్స్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కారం దారయ్య పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

నిడమర్రు ఆగస్టు 20 : గత ప్రభుత్వ హయాంలో బడుగు బలహీనవర్గాల పేదలకు ఇచ్చిన కాలనీలలో మౌలిక వసతులు కల్పించాలని జనసేన, టీడీపీ నాయకులు తహసీల్దార్ నాగరాజు కలసి విన్నవించుకున్నారు. క్రొవ్విడి గ్రామానికి చెందిన జనసేన గ్రామ పార్టీ అధ్యక్షులు వి.ఇంద్రకుమార్, టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షులు ఎస్.లెనిన్‌బాబు నూతనంగా తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన నాగరాజును మంగళవారం మర్యాదపూర్వకంగా కలసి తమ గ్రామ సమస్యలు తెలిపారు. టి.సూరన్న , టి.శ్రీనివాసు, తదితరులు పాల్గొన్నారు.

పిల్లల్లో ఐరన్ లోపం రాకుండా ముందస్తు చర్యలు

ఉంగుటూరు. ఆగస్టు 20 : పిల్లల్లో ఐరన్ లోపం రాకుం డా ముందస్తుగా రక్త న మూనాలు సేకరించి ప్రతి మూడు నెలలకు ఒకసారి పరీక్షించి వివిధ దశలలో ప్రత్యేకమైన చికిత్స చేసి వారిని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దుదామని వకాగుపాడు పీహెచ్‌సీ వైద్యాధి కారిణి డాక్టర్ మానస అన్నారు. మండల విద్యావనరుల భవనంలో మంగళ వారం జరిగిన అనిమియా ముక్తి భారత్ అవగాహనలో భాగంగా హిమోగ్లోబిన్ శాతం నమోదుకు రిజిస్టర్లు నిర్వహించాలని సూచించారు. స్థానిక ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ఎస్. పెద్దిరాజు, ఆరోగ్య విస్తరణాధికారి కె.శ్రీనివాసరావు, హెల్త్ విజిటర్ సుబ్బలక్ష్మి, సూపర్‌వైజర్ సత్యనారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి, శారదామణి, సీఆర్పీలు, తదితరులు హాజరయ్యారు.

క్రైం కార్నర్

మహిళ ఆత్మహత్య

ఏలూరు క్రైం, ఆగస్టు 20 : కడుపునొప్పి భరించలేక ఒక మహిళ సీలింగ్ ఫ్యానుకు ఉరి వేసుకుని మంగళవారం సాయంత్రం మృతి చెందింది. ఏలూరు రామకృష్ణాపురానికి చెందిన దువ్వనాగ కల్యాణి (32) భర్త మాణిక్యాలరావుకు ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. కూలి పనులు చేస్తూ జీవిస్తున్నారు. కొంత కాలం నుంచి కల్యాణి కడుపు నొప్పితో బాధపడుతోంది. సమాచారం ఏలూరు త్రీ టౌన్ పోలీసులకు అందించడంతో సీఐ కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఉంగుటూరు, ఆగస్టు 20 : మండలంలోని రాష్ట్రీయ రహదారి రావులపర్రు-రాచూరు మధ్య మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు, చేబ్రోలు పోలీసుల కథనం ప్రకారం నిడమర్రు మండలం నిడమర్రు ఎస్సీ కాలనీకి చెందిన యాళ్ళ వినోద్ కుమార్ (28) నడుచుకుంటూ వెళుతుండగా గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. ఢీకొన్న ద్విచక్ర వాహనం ఆగకుండా వెళిపోయినట్లు చేబ్రోలు ఎస్సై ఎ.మణి కుమార్ తెలిపారు.

అక్రమ మద్యం పట్టివేత

భీమడోలు, ఆగస్టు 20 : నిబంధనలకు విరుద్ధంగా పలు దుకాణాల్లో మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు భీమడోలు ఎక్సైజ్ సీఐ గిరిజా కుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు డీటీఎఫ్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సిబ్బంది ఉంగుటూరు మండలంలోని పలు గ్రామాల్లో దాడులు నిర్వహించగా ఉంగుటూరు మండలంలో 31 మద్యం సీసాలతో దోసనపూడి పాండురంగారావు, కైకరం గ్రామంలో పది మద్యం సీసాలతో కేతినేని పవన్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.


జీలుగుమిల్లిలో కొవ్వొత్తుల ర్యాలీలో ఎమ్మెల్యే బాలరాజు


ముంజులూరు కొండరెడ్డిలో ఆందోళన చేస్తున్న కొండరెడ్లు



కుక్కునూరులో కొవ్వొత్తుల ర్యాలీ

దోషులను కఠినంగా శిక్షించాలి

- కొవ్వొత్తుల ర్యాలీలో ఎమ్మెల్యే బాలరాజు
- వైద్యురాలి హత్యాచారంపై కొనసాగుతున్న ఆందోళనలు

జీలుగుమిల్లి, ఆగస్టు 20 : కోల్‌కతాలో ట్రైనీ డాక్టరుపై అత్యాచారం హత్య ఘటనపై ప్రతీ ఒక్కరు స్పందించాలని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. జీలుగుమిల్లి ప్రధాన సెంటరు నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు మంగళవారం రాత్రి నిరసన వ్యక్తం చేస్తూ ఎన్‌డీపీ కూటమి ఆధ్వర్యంలో పలు ప్రజా సంఘాలు నిరసన ర్యాలీ నిర్వహించారు. కూటమి నాయకులు పసుపులేటి రాము, సుంకవల్లి సాయి, ఉండవల్లి సోమ సుందరం, చాట్రాతి ప్రసాద్, కోలా మధు, శాఖమూరి సాయి ఉన్నారు.

● బుట్టాయగూడెం : కోల్‌కతాలో పీజీ వైద్య విద్యార్థినిపై అత్యా చారం చేసి హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని పీవోడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.లత, పీవైఎల్ డివిజన్ ప్రధాన కార్యదర్శి జి.ప్రసాద్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని ముంజులూరు కొండరెడ్డి గ్రామంలో జరిగిన సభలో లత, ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ అత్యాచారాలు, హత్యలకు పాల్పడుతున్న దోషుల తరుపున లాయర్లు కూడా వాదించకూ డదన్నారు. కన్నాపురంలో బుధవారం ప్రదర్శన, సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాయకులు నడపల ముక్కారెడ్డి, సర్పంచ్ కెచ్చెల ముక్కారెడ్డి, బాల్‌రెడ్డి, అరగంటి బాబుల్‌రెడ్డి, వరలక్ష్మీ, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

● వేలేరుపాడు : స్థానిక జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, టీడీపీ నాయకులు ర్యాలీ నిర్వహించారు. హైస్కూల్ నుంచి ప్రారంభమైన ర్యాలీ ప్రధాన రహదారి గుండా సాగింది. డాక్టర్‌ను హత్య చేసిన హంతకులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం వద్ద మానవహారంగా ఏర్పడారు. టీడీపీ నాయకులు అమరవరపు అశోక్, కొమ్మన వెంకటేశ్వరరావు, జడ్పీ హైస్కూల్ విద్యా కమిటీ ఛైర్మన్ బేతి శ్రీనివాసరావు, అమరవరపు వెంకన్న, ముత్యాలరావు, సలీం, మురళీ, సుధాకర్, జడ్పీ హైస్కూల్ విద్యార్థులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● కుక్కునూరు : కూటమి ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. నిందితులను తక్షణమే బహిరంగంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మహిళలపై రోజురోజుకు ఆగాయిత్యాలు పెరుగుతున్నాయని బలమైన చట్టాలు అమలులోకి తేవాలన్నారు. టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు నాగేశ్వరరావు, జనసేన మండల అధ్యక్షులు ఎం.యుగంధర్, బీజేపీ నాయకులు లక్ష్మణాచార్యులు, నాయకులు గోపాలకృష్ణ, వరలక్ష్మి, వెంకటేశ్వర్లు, నాగరాజు, ఎం.నరేష్, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

'మంచి బుద్ధులు నేర్పే బాధ్యత ఉపాధ్యాయులదే'

జిల్లా ఎస్పీ కిశోర్


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కిశోర్

ఏలూరు క్రైం, ఆగస్టు 20 : విద్యార్థి దశ నుంచే పిల్లల్లో మంచి నడవడికను నేర్పించే బాధ్యత ఉపాధ్యాయులదేనని ఆ దిశగా విద్యార్థులను సన్మార్గంలో తీర్చిదిద్దాలని జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ అన్నారు. ఏలూరులో ఉన్న అన్ని కాలేజీలు, విద్యా సంస్థ ప్రిన్సిపాల్స్, అధ్యాపకులతో జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రతి స్కూలు పరిసర ప్రాంతాల్లో సీసీ టీవీలను ఏర్పాటు చేయాలని, ఏదైనా జరగరానిది జరిగితే సీసీ టీవీల్లో స్పష్టమైన సమాచారం రికార్డు అయి ఉంటుందని దర్యాప్తునకు అది ఎంతో ఉపయోగపడుతుందన్నారు. క్రైమ్ ఎగేనెస్ట్ ఉమెన్ ర్యాగింగ్ వల్ల విద్యా సంస్థలకు చెడ్డపేరు వస్తుందని ప్రతి కాలేజీలో యాంటీ ర్యాగింగ్ కమిటీలు నియమించాలన్నారు. సోషల్ మీడియా వలన కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి స్కూలు, పాఠశాల, కాలేజీల్లో ఫిర్యాదుల బాక్సును ఏర్పాటు చేయాలన్నారు. పోలీసుల నుంచి త్వరలో సైబర్ సైనిక్ అనే కార్యక్రమాన్ని తయారు చేస్తున్నామన్నారు. సైబర్ నేరాలు అరికట్టడంలో ఇంజనీరింగ్ విద్యార్థుల పాత్ర ఎంతో కీలకమైందన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే పోలీసులకు తెలియజేయాలన్నారు. విద్యా సంస్థల వద్ద నో ఎంట్రీ, నో హెల్మెట్ అనే బోర్డులను ఏర్పాటు చేయాలని ఎస్పీ సూచించారు. ఎక్కువ మంది యువత హెల్మెట్లు ధరించకపోవడం వల్ల ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. విద్యార్థుల పై క్రిమినల్ కేసులు నమోదు అయితే వారి బంగారు భవిష్యత్తు నాశనం అవుతుందన్నారు. ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, ఏలూరు టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ వైవీ రమణ, త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సాగు నీరందక బీటలు వారిన వరి చేలు


నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

ఏలూరు టూ టౌన్, ఆగస్టు 20 : కృష్ణా డెల్టా శివారు భూములకు సాగునీరందక పంట భూములు బీటలు వారుతున్నాయని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ వాపోయారు. రూరల్ మండలం మాదేపల్లి లింగారావుగూడెం, దాట్లంపూడి, జాలిపూడి గ్రామాల్లో వందలాది ఎకరాలకు నీరందడంలేదని రైతులు, కౌలు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శ్రీనివాస్ మాట్లాడుతూ పాతజాలిపూడి కాల్వ ఆయుకట్టు పరిధిలో పంట భూములకు సాగునీరందక పోయిన జల వనరుల శాఖ పట్టించుకోవడం లేదన్నారు. ఎకరానికి రూ.20 వేలు పెట్టుబడి పెట్టిన అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి సాగునీరు అందించాలని కోరారు.ఆర్.సూర్యనారాయణ, ఎ.భిక్షం, ఎం.ఏసు, డేరా జాన్, కె.బుల్లబ్బాయి, తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ దోమల నివారణ దినోత్సవం


ప్రపంచ దోమల నివారణ దినోత్సవంలో వైద్య సిబ్బంది

ఏలూరు అర్బన్, ఆగస్టు 20 : మలేరియా నుంచి మానవాళిని కాపాడేందుకు శ్రమించిన డాక్టర్ సర్ రొనాల్డ్‌రాస్ మహనీయుడని డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ట కొనియాడారు. ప్రపంచ దోమల నివారణ దినాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక కస్తూరిబా బాలికల మున్సిపల్ హైస్కూలులో విద్యార్థులకు అవగాహన, ర్యాలీలను నిర్వహించారు. తొలుత డీఎంహెచ్‌వో కార్యాలయంలో రొనాల్డ్‌రాస్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. డాక్టర్ శర్మిష్ట మాట్లాడుతూ దోమ కాటు వలన మనిషికి మలేరియా సోకుతుందని 1897 ఆగస్టు 20న నిరూపించిన రోజుని పురస్కరించుకుని ఏటా అదే రోజును ప్రపంచ దోమల నివారణ దినంగా జరుపుకుంటారన్నారు. డీఐవో డాక్టర్ నాగేశ్వరరావు, డీఎస్‌వో నరేంద్ర కృష్ణ, పూర్ణచంద్రరావు, నీలిమ, అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు, సిబ్బంది పాల్గొన్నారు.

● పోలవరం : ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా వింజరం పీహెచ్‌సీ సిబ్బంది అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఎల్లండీపేట వైద్యాధికారి నిఖిల్ నేతృత్వంలో వింజరం ఆస్పత్రి ఆవరణ, బోడిగూడెం, ఇటుకలకోట గిరిజన వసతి గృహాల్లో పాఠశాలల్లో విద్యార్థులకు దోమల వలన వచ్చే వ్యాధులు, నివారణ, డ్రైడే ఫ్రైడే గురించి అవగాహన కల్పించారు. డాక్టర్ మురళీధరన్, సోమరాజు, పోశమ్మ, మలేరియా సబ్ యూనిట్ అధికారి బి.నాగేశ్వరరావు, హెచ్‌ఎం వాణి, ఆరోగ్య ఉపాధ్యాయ సిబ్బంది, పాల్గొన్నారు.

రెండు నెలల్లో ఓటరు లిస్టు సర్వే పూర్తి చేయండి

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 20 : స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో తహసీల్దారు కె.స్లీవజోజి అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిలర్లకు, బీఎల్‌ఓలకు, రాజకీయ పార్టీల నాయకులకు సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ బీఎల్‌ఓలు రెండు నెలల్లో పట్టణంలో ఉన్న ప్రతీ ఇంటికి వెళ్ళి ఓటరు లిస్టు సర్వే చేసి పూర్తి చేయాలని ఆదేశించారు. అందుకు స్థానిక ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు బీఎల్‌ఓలకు సహకరించాలని ఆయన కోరారు. బీఎల్‌ఓలు చేసిన సర్వే ఆధారంగా 2025 జాతీయ ఓటరు దినోత్సవం నాటికి కొత్త ఓటరు లిస్టు సిద్ధం చేయనున్నట్లు తహసీల్దారు తెలిపారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి, కమిషనరు జె.నరేంద్రకుమార్, మున్సిపల్ కౌన్సిలర్లు, బీఎల్‌ఓలు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు. ఓటరు లిస్టులు సరి చేయాలని తహసీల్దారు స్లీవజోజికి జంగారెడ్డిగూడెం నగర పంచాయితీ మాజీ కౌన్సిలర్ చిట్టిబోయిన రామలింగేశ్వరరావు వినతి పత్రం అందజేశారు.

మహిళలపై దాడులు పెరిగిపోతున్నాయి


సదస్సులో మాట్లాడుతున్న జడ్జి రత్న ప్రసాద్

ఏలూరు క్రైం, ఆగస్టు 20 : రోజు రోజుకూ బాలికలు, మహిళలపై దాడులు పెరిగి పోతున్నా యని అప్రమత్తంగా ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి కె.రత్న ప్రసాద్ సూచించారు. ఏలూరు తంగెళ్ళమూడి ప్రాంతం యాదవ్‌నగర్‌లో ఉన్న సూర్య ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి కె.రత్న ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థికి ఎటు వంటి సమస్య ఉన్నా తమ కార్యాలయానికి లేఖ రాయవచ్చునని లేదా 08812 224555లో సంప్రదించాలని సూచించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఉచితంగా న్యాయ సహాయాన్ని అందిస్తుందన్నారు. ప్యానల్ న్యాయవాదులు కె.కృష్ణారావు, పి.వెంకటేశ్వరరావు, గంగాభవానీ, ప్రిన్సిపాల్ కె.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఒకే భవనంలో ఇన్ని తరగతులా?

ఏలూరు అర్బన్, ఆగస్టు 20 : ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి ఒకే భవనంలో సార్వత్రిక విద్య టెన్త్, ఇంటర్, డిగ్రీ తరగతులు, పరీక్ష కేంద్రాలు, విద్యార్థులకు హాస్టల్ నిర్వహిస్తున్న ఓ ప్రైవేటు విద్యా సంస్థపై పీడీఎస్‌యూ జిల్లా నాయకులు మంగళవారం ఇంటర్ బోర్డు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. వివరాలను సంఘ జిల్లా అధ్యక్షుడు కె.నాని మంగళవారం ఒక ప్రకటనలో తెలియ జేశారు. ఏలూరు ఎన్‌ఆర్‌పేటలో ఓ ప్రైవేటు విద్యా సంస్థ యాజమాన్యం నిర్వహి స్తున్న దీనికి ఇంటర్ బోర్డు ఎటువంటి అనుమతులు లేవన్నారు. తమ ఫిర్యాదుపై విద్యాశాఖ అధికారులు ఇప్పటికైనా స్పందించి ఒకే భవనంలో ఇన్ని విద్యాకోర్సులు, తరగతులు, పరీక్షలు, హాస్టల్ నిర్వహించడానికి ఎవరు అనుమతిచ్చారో విచారణ జరిపి, విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని డిమాండ్ చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో పీడీఎస్‌యూ నాయకులు క్రాంతి, సునీల్‌కుమార్, రాజు తదితరులున్నారు.

ఆర్‌ఐవో వివరణ

పీడీఎస్‌యూ నాయకుల ఫిర్యాదుపై ఇంటర్ బోర్డు జిల్లా ఆర్‌ఐవో చంద్రశేఖర బాబు వివరణ ఇచ్చారు. 'స్థానిక జూనియర్ కళాశాల యాజమాన్యంపై అందిన ఫిర్యాదును పరిగణనలోకి తీసుకుని విచారణ చేపట్టామన్నారు. విచారణను త్వరితగతిన పూర్తిచేసి ఉల్లంఘనల విషయమై క్రమ శిక్షణ చర్యలు తీసుకోవాలని ఇంటర్ బోర్డు కార్యదర్శికి నివేదిక పంపిస్తామని పేర్కొన్నారు.

ఘనంగా ఫొటోగ్రఫీ డే


మాట్లాడుతున్న జనసేన జిల్లా కార్యదర్శి రవికుమార్

జీలుగుమిల్లి, ఆగస్టు 20 : ప్రపంచ ఫొటోగ్రఫీ డేని కామ య్యపాలెంలో ఫొటో గ్రాఫర్‌లు ఘనంగా జరుపుకున్నారు. ఫొటో గ్రాఫర్‌లను ఆదుకుని చేయూత అందించే దిశగా వారి సమస్యల్ని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ తామని జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్ అన్నారు. మండలంలో పలువురు ఫొటో గ్రాఫర్‌లకు ఐడీ కార్డులు అందజేశారు. కేక్ కట్ చేసి 157వ ఫొటో గ్రాఫర్స్ డేను జరిపారు. వారికి ఇళ్ల స్థలాలు, అర్హులైన వారికి పింఛన్లు వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మండల ఫొటో గ్రాఫర్‌లు పాల్గొన్నారు.

మానవత సంస్థ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ


భీమడోలు జంక్షన్‌లో మానవహారంగా విద్యార్థులు, మానవతా సభ్యులు

కొయ్యలగూడెం, ఆగస్టు 20: మానవత సంస్థ ద్వారా ప్రజలకు సేవలందించామని మానవత సంస్థ అధ్యక్షుడు మాటూరి సుధీర్, సెక్రటరీ కమ్మంపాటి సాయి తెలిపారు. ఈ మేరకు మంగళవారం మానవత సంస్థ ఆవిర్భావించిన సందర్భంగా కొయ్యలగూడెం విద్యార్థుల ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంస్థ 2004లో ఏర్పడిందని మానవత సంస్థ ద్వారా ప్రజలకు ఎన్నో సేవలందించామని అన్నారు. ఈ సంస్థ తరఫున మరింత కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉమామహేశ్వర రావు, త్రిపుర సుందరి, స్వామి, ముప్పానపల్లి వెంకటేశ్వరరావు, నక్కా బాబి, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

● భీమడోలు : మానవత స్వచ్ఛంద సంస్థ వారోత్సవాల్లో భాగంగా ఆ సంస్థ ప్రతినిధులు, విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు గ్రామంలో ర్యాలీ నిర్వహించి భీమడోలు జంక్షన్‌లో మానవహారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు హాజరయ్యారు. గ్రామంలోని హైస్కూలు నుంచి సాయిబాబా ఆలయం మీదుగా భీమడోలు జంక్షన్ వరకూ వందలాది మంది విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. మానవత చేస్తున్న సేవా కార్యక్రమాలను గన్ని కొనియాడారు. సంస్థ ప్రతినిధులు రామిశెట్టి గంగాధర్, పసుపులేటి సాంబశివరావు, శ్రీనివాసరావు, ఉమామహేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

● పెదపాడు : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రముఖ పారిశ్రామికవేత్త, బొమ్ములూరు దీపక్ నెక్స్‌జెన్ ఎండీ అడుసుమిల్లి సుబ్రహ్మణేశ్వరరావు అన్నారు. అప్పనవీడులో ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలు - నివారణ అనే అంశంపై మానవత ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన సుబ్రహ్మణేశ్వరరావు మాట్లాడుతూ సిమ్లాలో ప్లాస్టిక్ వినియోగం ఉండదన్నారు. అనంతరం ప్లాస్టిక్ వినియోగం తగ్గించడంలో భాగంగా మానవత సంస్థకు భోజనం, టిఫిన్ ప్లేట్స్, గ్లాసులను అందజేశారు. కె.సత్యనారాయణ, ఎం.కోటేశ్వరరావు, జయరామచంద్రరావు, గణేష్‌బాబు, సత్యనారాయణ, నిర్మల, పద్మజ, సూర్యనారాయణ, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి రూ.రెండు లక్షల విరాళం



చెక్కు అందజేస్తున్న ప్రిన్సిపాల్, విద్యార్థులు

భీమడోలు, ఆగస్టు 20 : లివర్ అనారోగ్యంతో బాధపడుతున్న మామిడి జ్ఞానేశ్వరి అనే చిన్నారికి భీమడోలు మానస పాఠశాల విద్యార్థు లు వైద్య సేవల కోసం రూ.రెండు లక్షల 26 వేల 50లు విరాళాన్ని అందజేశారు. మామిడి జ్ఞానేశ్వరి అనే చిన్నారి అనారోగ్యంతో బాధపడుతుండగా ఆ చిన్నారి లివర్ ట్రాన్స్ ప్లాంటేషన్ కోసం పలు పాఠశాలల్లో విద్యార్థులు, యాజమాన్యాలను ఆదుకోవాలంటూ కుటుంబ సభ్యులు అభ్యర్థించారు. ఈ మేరకు మానస పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఆయాలు, డ్రైవర్లు, క్లీనర్లు, సిబ్బంది కలిపి ఈ మొత్తం సొమ్మును సేకరించి కుటుంబ సభ్యులకు అందజేశారు.

లైసెన్సు లేకుండా వాహనాలు నడప వద్దు

ఏలూరు క్రైం, ఆగస్టు 20 : వాహనదారులు డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనాలను నడపకూడదని ఎవరైనా అలా నడిపితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఏలూరు టూటౌన్ సీఐ వైవీ రమణ హెచ్చరించారు. ఏలూరు అశోక్‌నగర్ ప్రాంతంలో మంగళవారం వాహనాల తనిఖీలు నిర్వహించారు. పలువురు వాహనదారులకు, మైనర్లకు, వాహనాల యజమానులకు సీఐ రమణ కౌన్సిలింగ్ నిర్వహించారు. డ్రైవింగ్ లైసెన్సు ఉండాలని, వాహనాల ధ్రువీకరణ పత్రాలు, ఇన్సూరెన్సు ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలు ఖచ్చితంగా ఉండాలన్నారు. సీఐతో పాటు ఎస్‌ఐలు సాదిక్, మదీనా బాషా పాల్గొన్నారు.

వర్మీ కంపోస్టు షెడ్ల నిర్వహణపై అవగాహన


తాటియాకులగూడెంలో వర్మీకంపోస్టు యూనిట్‌లను పరిశీలిస్తున్న పంచాయితీ రాజ్ అధికారులు ఎంపీడీవో కార్యదర్శులు

జీలుగుమిల్లి, ఆగస్టు 20 : ఏపీ పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధి డైరెక్టర్ ఆదేశాల మేరకు మూడు రోజుల పాటు పంచాయితీ కార్యదర్శులకు జీలుగుమిల్లిలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ క్రమంలో మంగళవారం తాటియాకులగూడెంలో చెత్త నుంచి సంపద ఘన ద్రవ వ్యర్థాల ద్వారా ఏర్పాటు చేసిన వర్మీ కంపోస్టు యూనిట్‌లను పరిశీలించారు. ఎంపీడీవో కేఆర్‌ఎస్ కృష్ణప్రసాద్, ఏవో కేఎం మంగతాయారు, టీవోటీ డీపీఆర్‌సీ, ఎఫ్‌టీసీలు జి.నాగేశ్వరావు ఉన్నారు.

● భీమడోలు : పంచాయతీ పరిపాలనా విధానంపై జరుగుతున్న శిక్షణా కార్యక్రమ రెండో రోజు ఘన వ్యర్థపదార్థాల నిర్వహణపై రీసోర్స్‌పర్సన్ ముత్తయ్య తదితరులు సర్పంచ్‌లకు, కార్యదర్శులకు భీమడోలు చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో శిక్షణ నిచ్చారు. ఎంపీడీవో పద్మావతిదేవి, అధికారులు పాల్గొన్నారు.

● పెదపాడు : పంచాయతీల్లో సాధారణ పరిపాలనలో భాగంగా నిర్వర్తించవలసిన విధులు, అభివృద్ధి పనులు గ్రామ అభివృద్ధిలో ఎంతో కీలకమని ఎంపీడీవో తేజ రతన్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తడి, పొడి చెత్తలను వేరు వేరుగా నిల్వ చేయడం, వర్మి కంపోస్టు తయారీపై అవగాహన కల్పించారు.

అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కుక్కునూరు, ఆగస్టు 20: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో కెమిస్ట్రీ, బోటని సబ్జెక్టులకు అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోస్టు గ్రాడ్యుయేషన్‌లో 50 శాతానికి పైగా మార్కులు పొందిన వారు అర్హులన్నారు. ఈ నెల 22వ తేదీ సాయంత్రం నాలుగు గంటల వరకు కుక్కునూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీకి వచ్చి దరఖాసులు అందజేయవచ్చన్నారు. 23వ తేదీన ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు.

ధర్మాజీగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 20 : ధర్మాజీగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి.సుష్మ కౌముది తెలిపారు. ఎకనామిక్స్, సివిక్స్, తెలుగు, హిస్టరీ సబ్జెక్టులు బోధించుటకు పోస్టు గ్రాడ్యుయేషన్‌లో 50 శాతం పైబడి మార్కు లు పొందిన వారు అర్హులన్నారు. ఆసక్తి గలవారు ఈ నెల 23వ తేదీ సాయంత్రం నాలుగు గంటలలోపు ధర్మాజీగూడెం కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని, 24వ తేదీ ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు జరుగుతాయని, మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 88863 30045లో సంప్రదించాలన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు ఆన్‌లైన్లో దరఖాస్తు

ఏలూరు అర్బన్, ఆగస్టు 20 : డిసెంబరు 8న జరుగనున్న ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు ఆన్‌లైన్ అప్లికేషన్ bse.ap.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందని డీఈవో అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. నమోదు సమయంలో విద్యార్థి ఆధార్ కార్డులో ఉన్న విధంగానే పేరు, పుట్టిన తేదీ, తండ్రి పేరు నమోదు చేయాలని సూచించారు. పరీక్ష రుసుం ఆన్‌లైన్‌లోనే చెల్లించాలని, వివరాలకు వెబ్‌సైట్ లేదా డీఈవో కార్యాలయంలోగాని సంప్రదించాలని సూచించారు.

సంక్షిప్త సమాచారం..

- **కామవరపుకోట:** స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కె.శ్రీదేవి, ఏఓ. సత్యవాణి తెలిపారు.
- అన్యాక్రాంతమైన అసైన్డ్ భూములను కోనేరు రంగారావు భూకమిషన్ సిఫార్సుల మేరకు అర్హత కలిగిన పేదలకు పంచాలని సీపీఐ మండల కార్యదర్శి టీవీఎస్ రాజు కోరారు. స్థానిక తహసీల్దార్ గెడ్డం ఎలీషాను మంగళవారం ఆయన కలుసుకుని ఈ మేరకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.
- **జంగారెడ్డిగూడెం :** చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా గురువారం నిర్వహించే ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిర కరపత్రాలను విడుదల చేశారు. చిరంజీవి యువత గౌరవ అధ్యక్షుడు ఎం.ప్రసాద్, అధ్యక్షుడు యు.సీతారామ్, సీహెచ్ నాని,బ్లడ్ బ్యాంకు అధ్యక్షుడు వి.తాతాజీ పాల్గొన్నారు.
- **పెదపాడు :** వట్లూరు, వేంపాడు గ్రామాల్లో జరుగుతున్న పంట నమోదు కార్యక్రమాన్ని జేసీ ధాత్రిరెడ్డి మంగళవారం పరిశీలించారు. పంట నమోదు చేసే విధానం , లోటుపాట్లను వ్యవసాయ శాఖ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గ్రామ సహాయకులకు ఈ-పంట నమోదు పూర్తి అయ్యేవరకు ఇతర పనులు అప్పగించకుండా చూస్తామన్నారు. ఏవో వి.ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.
- **ఉంగుటూరు :** నారాయణపురం మాజీ సర్పంచ్‌లు పాతూరి గంగరాజు, దమయంతిల జ్ఞాపకార్థం వారి కుమారుడు పాతూరి సత్యనారాయణ రూ.ఐదు వేల ఆర్థిక సాయంతో మహాత్మగాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు గుర్తింపు కార్డులను అందజేశారు.
- **దెందులూరు :** స్థానిక ప్రభుత్వాస్పత్రిని మంగళవారం తహసీల్దార్ బి.సుమతి పరిశీలించారు. ఆస్పత్రి ప్రధాన వైద్యులు సుందరిబాబును వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు.
- **కుక్కునూరు :** ఇబ్రహీంపేట ఇసుక డిపోలో మెట్రిక్ టన్నుకు రూ.210, వింజరం ఇసుక డిపోలో మెట్రిక్ టన్ను రూ.362కు విక్రయిస్తున్నామని తహసీల్దార్ పెద్దిరాజు తెలిపారు.
- **ఏలూరు టూ టౌన్ :** శివాన్ సూర్య విద్యానిధి ఫౌండేషన్ చైర్మన్ మురళీకృష్ణ జన్మదినాన్ని పురస్క రించుకుని విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు గోసంరక్షణ సమితి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. నగర మేయర్ షేక్ నూర్జహాన్, ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాయిసుమంత్, మానవత విద్యానిధి అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు, ఏలూరు లయన్స్ క్లబ్ అధ్యక్షులు చలపతిరావు, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.
- **పోలవరం :** పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి రూ.12 వేల కోట్లు, ఆర్‌అండ్ ఆర్ సమస్యల పరిష్కారానికి రూ.32 వేల కోట్లు తక్షణమే మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య డిమాండ్ చేశారు. సీపీఐ నియోజవర్గ కార్యదర్శి కె.దారయ్య, మండల కార్యదర్శి జేవీ నరసింహరావు, జి.వేణుగోపాలకృష్ణ, టి.రవికుమార్ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సీబీ కెనాల్‌లో తూడు తొలగింపు



కలిదిండి, ఆగస్టు 20: గుర్వాయిపాలెం సీబీ కెనాల్‌లో దట్టంగా పేరుకుపోయిన డెక్క, తూడు తొలగింపు పనులను అధికారులు చేపట్టారు. ఆంధ్రజ్యోతిలో ఈ నెల 17న "సిబి కెనాల్‌లో పేరుకుపోయిన తూడు" శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కొండంగి ఎత్తిపోతల పథకాల నుంచి గుర్వాయిపాలెం వంతెన వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేర ఎక్స్‌కవేటర్‌తో తూడు, డెక్కను యుద్ధప్రాతిపదికన తొలగిస్తున్నారు. దీంతో ఎత్తిపోతల నీరు సీబీ కెనాల్‌లో సమృద్ధిగా ప్రవహించటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తూ ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు.



పాడైన వరి పొలాల పరిశీలన

ముదినేపల్లి, ఆగస్టు 20 : మండలంలోని ములకలపల్లిలో రొయ్యల చెరువుల నుంచి వస్తున్న ఉప్పునీటి వల్ల పాడైన సార్వా వరి పైరును రెవెన్యూ, ఫిషరీస్ శాఖల అధికారులు, సిబ్బంది మంగళవారం పరిశీలించారు. "రొయ్యల చెరువులతో ఎండిన పైరు" శీర్షికన మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి స్పందించిన తహసీల్దార్ సుబానీ వెంటనే ఆ గ్రామ వీఆర్వో, ఫిషరీష్ సిబ్బందిని పొలాన్ని పరిశీలించాలని ఆదేశించడంతో వీఆర్వో పద్మావతి, మండల మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సతీష్, ఇతర సిబ్బంది దెబ్బతిన్న పొలాలను పరిశీలించారు. రొయ్యల చెరువుల సరిహద్దుల్లో ఉన్న పొలాల్లో ఉప్పునీటి ఊటతో పాడైన సార్వా వరి నాట్ల పొలాలను నమోదు చేశారు. ఆ ప్రాంతంలోని పంట, మురుగు బోదెల్లోని నీటిని కూడాఆ పరీక్షల నిమిత్తం సేకరించామని ఎఫ్‌డీవో సతీష్ తెలిపారు. దీనిపై తహసీల్దార్‌కు సమగ్ర నివేదికను అందజేస్తామన్నారు. ఆంద్రియ్య, సంజీవరావు తదితరులు తమ పొలాలు రొయ్యల చెరువుల ఉప్పునీటి ఊట వల్ల దెబ్బతింటున్నాయని తెలిపారు. దీనిపై తగు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సుబానీ తెలిపారు.

11 మంది ఎస్‌ఐలు, ఇద్దరు సీఐల బదిలీ

ఏలూరు క్రైం, ఆగస్టు 20 :జిల్లాలో పనిచేస్తున్న ఎస్‌ఐలలో 11 మందిని పరిపాలనా సౌలభ్యంలో భాగంగా బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ కిషోర్ ఉత్తర్వులు జారీ చేశారు. చేబ్రోలు ఎస్‌ఐ ఆకుల మణికుమార్‌ను గణపవరం ఎస్‌ఐగా నియమించారు. అక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ వెంకటేశ్వరరావును ఏలూరు వీఆర్‌లో ఉంచారు. ఏలూరు వీఆర్‌లో ఉన్న ఎస్‌ఐ షేక్ జబీర్‌ను జంగారెడ్డిగూడెం ఎస్‌ఐగా,అక్కడ పని చేస్తున్న ఎస్‌ఐ జ్యోతిబసును ఏలూరు వీఆర్‌లో ఉంచారు. ధర్మాజీగూడెం ఎస్‌ఐ చెన్నారావును తడికలపూడి ఎస్‌ఐగా నియమించగా బుట్టాయిగూడెం ఎస్‌ఐ వెంక న్నను ధర్మాజీగూడేనికి నియమించారు. ఏలూరు వన్‌టౌన్ ఎస్‌ఐ నవీన్‌కుమార్‌ను జీలుగుమిల్లికి, ఏలూరు వీఆర్‌లో ఉన్న దుర్గా మహేశ్వరరావును బుట్టాయి గూడే నికి బదిలీ చేశారు. ఏలూరు టూటౌన్ ఎస్‌ఐ షేక్ మదీనా బాషాను ఏలూరు వన్‌టౌన్ ఎస్‌ఐగా నియమించారు. పెదపాడు ఎస్‌ఐ శుభశేఖర్‌ను ఆగిరిపల్లికి బదిలీ చేయగా ఆగిరిపల్లి ఎస్‌ఐ సురేంద్రకుమార్‌ను ఏలూరు వీఆర్‌లో ఉంచారు. ఇద్దరు సీఐలను బదిలీ చేస్తూ ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏలూరు రేంజ్ వీఆర్‌లో ఉన్న రమేష్‌బాబును కుక్కునూరు సీఐగా నియ మించగా అక్కడ పనిచేస్తున్న శ్రీనివాసరావును ఏలూరు రేంజ్ వీఆర్‌లో ఉంచారు. భీమవరం జిల్లా దిశ పోలీస్ స్టేషన్ డీఎస్పీ ఎన్.మురళీకృష్ణను విజిలెన్స్ ఎన్‌ఫోర్స్ మెంట్‌కి బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

పోలవరం దస్త్రాల దహనంపై కేంద్రం సీరియస్

కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ



భీమవరం టౌన్, ఆగస్టు 20 : పోలవరం ప్రాజె క్టుకు సంబంధించిన దస్త్రాలు తగల బడిన సంఘటనపై కేంద్ర ప్రభుత్వం చాలా సీరియస్‌గా ఉందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ అన్నారు. మంగళవారం భీమవరంలో ఆయన విలేక రులతో మాట్లాడారు. పోల వరం ప్రాజెక్టు అథారిటీ కూడా చాలా సీరియస్‌గా తీసుకుందన్నారు. ఖచ్చి తంగా సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవడమే కాకుండా, తగలబడిన దస్త్రాలు వెనుక ఉన్న కథ ఏమిటి అన్న విష యాన్ని బయ టకు లాగుతామని అన్నారు. విశాఖ రైల్వే జోన్ గతంలోనే ప్రకటన చేయడం జరిగిందని దీనికి సంబంధించి గత ప్రభుత్వం భూములు కేటాయింపు సరిగా చేయ లేదన్నారు. అందువల్లే ఆలస్యం అయ్యిందని ఇప్పుడు ముందుకు వెళ్ళే పరిస్థితి ఉందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ఉన్నతాధికారులు స్వాతంత్ర్య దినోత్సవం నాడు సినిమా పాటలకు డ్యాన్స్ చేశారనే విషయం తన దృష్టి రాలేదని ఆ వీడియో పరిశీలించి అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు.



వైద్యురాలిపై హత్యాచారం నిరసిస్తూ ర్యాలీ

కలిదిండి, ఆగస్టు 20 : కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచారం నిరసిస్తూ మంగళవారం కలిదిండిలో సుగుణ కళాశాల విద్యార్థులు నిరసన ర్యాలీ నిర్వహించారు. దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, ఏవో పోతురాజు, అజయ్, ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్ జి.మోహన్‌రావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విచారణ జరుపుతున్న తహసీల్దార్, ఎస్సై (ఇన్‌సెట్) మృతురాలు జయలక్ష్మి (ఫైల్)

కుమార్తె మృతిపై అనుమానాలు

5 నెలల క్రితం ఘటన.. స్పందించని పోలీసులు?

హోం మంత్రి, ఎస్పీకి తండ్రి ఫిర్యాదుతో కదిలిన యంత్రాంగం

చాట్రాయి, ఆగస్టు 20: ఏలూరు జిల్లా చనుబండలో 5 నెలల క్రితం కందుల జయలక్ష్మి (23) మృతి చెందగా, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం తహసీల్దార్ ప్రశాంతి, ఎస్సై కేసీహెచ్ స్వామి విచారణ జరిపారు. చాట్రాయి మాజీ ఎంపీపీ, టీడీపీ నాయకుడు కందుల కృష్ణ కుమార్తె జయలక్ష్మి అనే వివాహిత భర్త నుంచి విడిపోయి తండ్రి వద్దే ఉంటోంది. ఈ ఏడాది ఏప్రిల్ 6న ఇంట్లో అనుమానస్పద స్థితిలో మృతి చెందగా ఆమె మృతికి కారణాలు తెలుసుకోకుండా కుటుంబ సభ్యులు దహన సంస్కారాలు నిర్వహించారు. తరువాత మృతురాలి సెల్‌ఫోన్ చెక్ చేయటంతో ఓ యువకుడిపై అనుమానాలు వ్యక్తం అయ్యాయి. తన కుమార్తెను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రించారని, ఏప్రిల్ 11న మృతురాలి తండ్రి కందుల కృష్ణ చాట్రాయి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే పోలీసులు పట్టించుకోకపోవటంతో దర్యాప్తు ముందుకు వెళ్ళలేదు. మృతురాలి తండ్రి కందుల కృష్ణ హోం మంత్రికి, జిల్లా ఎస్పీకి, ఉమెన్ ప్రొటెక్షన్ సెల్‌కు ఫిర్యాదు చేయటంతో అధికారులు విచారణ చేపట్టారు. నూజివీడు ఏరియా ఆసుపత్రి వైద్య నిపుణులు మృతురాలికి దహనం చేసిన ప్రదేశాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించారు. మృతురాలి కుటుంబ సభ్యులు, బంధువుల నుంచి అధికారులు వివరాలు సేకరించారు. వీఆర్వోలు శ్యాం మురుగన్, శోభనబాబు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మిగులు ఉపాధ్యాయుల దారెటు..

సర్దుబాటు తెచ్చిన కొత్త చిక్కులు

వైసీపీ తెచ్చిన 117 జీవోతో తంటా



ముదినేపల్లి, ఆగస్టు 20 : ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ కొత్త చిక్కులు తెచ్చి పెట్టింది. ఉన్నత పాఠశాలలను వదిలి దూర ప్రాంత పాఠశాలలకు వెళ్లాల్సిన పరిస్థితి ఎదురైంది. గత ప్రభుత్వం జారీ చేసిన 117 జీవో ప్రకారమే విద్యా శాఖ సర్దుబాటు ప్రక్రియను చేపట్టడంతో మిగులు టీచర్లలో ఎక్కువ శాతం మందికి ఇబ్బందులు కలగనున్నాయి. ముదినేపల్లి మండలంలో సర్దుబాటు కౌన్సెలింగ్ అనంతరం 23 మంది ఉపాధ్యాయులు ఇంకా మిగులు ఉన్నారు. వారిలో కొంతమంది తెలుగు, హిందీ పండిట్‌లు ఉన్నారు. వీరిలో ఒక్కరిని కూడా మండలంలోని పాఠశాలలకు సర్దుబాటు చేసే అవకాశం లేకపోవడంతో డివిజన్ స్థాయి సర్దుబాటు కౌన్సెలింగ్‌కు వెళ్లాల్సి ఉంది. అంటే మండలాల్లో సర్దుబాటు అనంతరం మిగిలిన ఉపాధ్యాయులను డీఈవో పూల్‌లో ఉంచుతారు. వారిని డివిజన్‌లో ఖాళీగా ఉన్న పాఠశాలల్లో సర్దుబాటు చేస్తారు. ప్రస్తుతం మండలంలో మిగులుగా గుర్తించిన 23 మంది ఉపాధ్యాయులు పరిసర మండలాలైన మండవల్లి, కలిదిండి, కైకలూరు మండలాల్లో కూడా సర్దుబాటుకు ఖాళీలు లేవు. దీంతో వీరంతా ఏలూరు డివిజన్‌కు వెళ్లాల్సిందే. సర్దుబాటు ప్రక్రియను ఇప్పటికిప్పుడు చేపట్టి డిప్యుటేషన్‌పై దూర ప్రాంతాల పాఠశాలలకు వెళ్లటం ఇబ్బందికరమేనని మండలంలోని మిగులు ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీవోను సవరించి మిగులు ఉపాధ్యాయులను అదే మండలంలో యూపీ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులలో భర్తీ చేస్తే బాగుంటుందని ఉపాధ్యాయ సంఘాల నాయకులు అభిప్రాయ పడుతున్నారు.

సమస్యలు పరిష్కరించరూ..

సీఎంను కలిసి కైకలూరు సమస్యలు తెలిపిన ఎమ్మెల్యే కామినేని



కైకలూరు ఆగస్టు 20: కైకలూరు నియోజకవర్గంలో నెలకొన్న సమస్య లను ముఖ్యమంత్రి చంద్రబాబు కు దృష్టికి ఎమ్మెల్యే కామి నేని శ్రీనివాస్ తీసుకువె ళ్లారు. మంగళవారం విజయవాడలో ఆయన చంద్ర బాబును కలిశారు. నియోజకవర్గంలో ప్రధానం గా రహదారులు ధ్వంసమై రాకపోకలకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా నూతన పైపులైన్ నిర్మాణానికి సహకరించాలన్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో సాగునీటి ఇబ్బందులు తీవ్రంగా ఉన్నాయని, కాలువల సామర్థ్యం మేరకు నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని విన్నవించారు. కరెంటు చార్జీలు తగ్గించి ఆక్వా రంగాన్ని ఆదుకోవాలని, అలాగే కొల్లేరు ప్రజల సమస్యలను సీఎంకు తెలపగా ఆయన సానుకూలంగా స్పందించారని కామినేని వెల్లడించారు. ఆలయాల ద్వారా ప్రజల్లో భక్తిభావాలు పెంపొందించేలా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కైకలూరు చిన్నచెరువు గట్టుపై గల సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆయన పూజలు నిర్వహించి అన్నసమారాధనను ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, కూటమి నేతలు నర్సిపల్లి అప్పారావు, బీకేఎం నాని, పూల రామచంద్రరావు, కొల్లి వరప్రసాద్, మంగినేని రామకృష్ణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



వాడవల్లిలో రొయ్యల చెరువుల నీటికి పాడైపోయిన వరి పొలం

పొలాల్లో రొయ్యల చెరువుల నీరుపై ఫిర్యాదు

ముదినేపల్లి, ఆగస్టు 20 : ముదినేపల్లి మండలం వాడవల్లి రెవెన్యూ విలేజ్ ఏరియాలోని చినవాడవల్లి ఆయకట్టు పొలాలకు రొయ్యల చెరువుల బెడద ఎక్కువయింది. ఆ ప్రాంతంలోని రొయ్యల చెరువుల నుంచి వస్తున్న నీటి వల్ల సార్వా వరి పొలాలు దెబ్బతింటున్నాయి. రొయ్యల చెరువుల నుంచి ఉప్పునీటిని పంట కాల్వల్లోకి వదిలేయటం వల్ల ఆ నీరు పొలాల్లోకి వచ్చి వరి పైరు ఎండిపోతోందని రైతులు, కౌలు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తన 2.50 ఎకరాల పొలంలో నాట్లు పూర్తిగా పాడైపోయాయని పక్కనే ఉన్న రొయ్యల చెరువుల నుంచి పంట కాల్వలోకి నీరు రాకుండా చర్యలు తీసుకోవాలని వాడవల్లికి చెందిన కౌలు రైతు గోపాల సుబ్రహ్మణ్యం, ఇతర రైతులు మంగళవారం తహసీల్దార్ సుబానీకి ఫిర్యాదు చేశారు.

దోమలు నిర్మూలించాలి



కైకలూరు ఆగస్టు 20: ప్రజలు దోమకాటుకు గురవ్వకుండా జాగ్రత్తలు పాటించాలని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డి. ఉదయప్రకాష్ అన్నారు. మంగళవారం ప్రపంచ దోమల నివారణ దినం పురస్కరించుకుని కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో దోమల వలన కలిగే ప్రమాదాలను, వాటి నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డెంగీ, జికా, చికున్‌గున్యా దోమకాటు వల్లే వస్తాయని, ఇళ్ల వద్ద మురుగునీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు పాటిస్తే డెంగీ జ్వరాన్ని నివారించవచ్చన్నారు. దోమల వల్ల వచ్చే వ్యాధులపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించి వాటి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. అధ్యాపకులు డాక్టర్ ఎం. విజయకుమార్, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో పాల్గొన్న సంరక్షకులు, విద్యార్థులు

బాలల విద్యాభివృద్ధికి సహకరించాలి

కైకలూరు, ఆగస్టు 20: తల్లిదండ్రులు లేని పిల్లల విద్యాభివృద్ధికి కృషి చేయాలని జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ డాక్టర్ సూర్య చక్రవేణి అన్నారు. మంగళవారం కైకలూరు మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని తల్లిదండ్రులు లేని పిల్లల సంరక్షకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మిషన్ వాత్సల్య స్పాన్సర్ షిప్ పథకానికి నియోజకవర్గంలో 37 మంది లబ్ధిదారులు ఎంపికయ్యారని, వారికి ప్రభుత్వం అందించే ఆర్థిక సాయాన్ని వారి చదువులకు వినియోగించాలన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ డాక్టర్ వి దీప్తి మాట్లాడుతూ ఈ పథకం ద్వారా నెలకు రూ.4 వేలు చొప్పున 6 నెలలకు గాను ఒక్కొక్కరికి రూ.24 వేలు చొప్పున 37 మందికి లబ్ధిదారులకు రూ.8.8 లక్షలు నేరుగా వారి ఖాతాల్లో జమ అయినట్లు తెలిపారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఎంఎస్‌కెలు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

దుర్గాదేవికి మంత్రి సారథి పూజలు



ఆగిరిపల్లి, ఆగస్టు 20: దుర్గా దేవి దీవెనలతో రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. గొల్లగూడెంలోని శ్రీకృష్ణ దుర్గాదేవి అమ్మవారిని సోమవారం రాత్రి మంత్రి దర్శించుకొని పూజలు చేశారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు అర్చకులు, పీఠాధిపతి పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ప్రజలంతా పాడిపంటలతో ఆరోగ్యంతో సుఖంగా జీవించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రం అన్ని రంగాల్లో దేశంలోనే నంబరు వన్‌గా ఎదగాలని కోరుకున్నట్లు చెప్పారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు శ్రీనివాసు, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మండవల్లి, ఆగస్టు 20: మండవల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అతిథి అధ్యాపకులుగా పనిచేసేందుకు ఆసక్తి కల్గిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని మండవల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బేతపూడి రవితేజ మంగళవారం తెలిపారు. కళాశాలలో తెలుగు, ఫిజిక్స్, హిస్టరీ లెక్చరర్లుగా పనిచేసేందుకు ఆసక్తి కల్గిన వారు ఆయా సబ్జెక్టుల్లో పీజీ పూర్తిచేసి అందులో 55% మార్కులు పైబడి ఉండాలని, ఈ నెల 21, 22 తేదీల్లో దరఖాస్తులు స్వీకరించి, 23న కళాశాలలో ఇంటర్వ్యూ నిర్వహిస్తామని తెలిపారు.

తపాలా శాఖ బీమాతో భరోసా



కైకలూరు, ఆగస్టు 20: తపాలా శాఖ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఇండియన్ పోస్ట్ పేమెంట్ సీనియర్ మేనేజర్ గణేష్ అన్నారు. మంగళవారం కైకలూరు తపాలా శాఖ కార్యాలయంలో గ్రామానికి చెందిన గుల్లిపల్లి ప్రసాద్‌కు గ్రూపు యాక్సిడెంట్ గార్డ్ పాలసీ ద్వారా రూ.లక్ష బీమా చెక్కును అందజేశారు. తపాలా శాఖ, నివా బూపా జనరల్ ఇన్సూరెన్సు సంయుక్త పాలసీ అయిన గ్రూపు యాక్సిడెంట్ గార్డ్ రూ.555లు ప్రీమియం చెల్లించిన కొద్దిరోజులకే ప్రసాద్ ప్రమాదానికి గురవడంతో ఈ చెక్కును అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే తపాలా శాఖ ద్వారా ఉన్న గ్రూపు ఇన్సూరెన్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి



పెద్దింట్లమ్మ (ఫైల్)

ముదినేపల్లి, ఆగస్టు 20 : ముదినేపల్లి మండలం వైవాక గ్రామంలో శతాధిక వృద్ధురాలు తుంగల పెద్దింట్లమ్మ (105) అస్వస్థతతో సోమవారం మృతి చెందింది. ఈమెకు ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు. పెద్ద కుమార్తె 80 సంవత్సరాల వయసులో మృతి చెందగా, 72 సంవత్సరాల వయస్సుగల రెండో కుమార్తె, 68 ఏళ్ల వయసుగల కుమారుడు, 64 ఏళ్ల వయస్సున్న చిన్న కుమార్తె ఉన్నారు. పెద్దింట్లమ్మకు సుమారు 30 మంది మనుమలు, మనుమరాండ్రు, ముని మనుమలు ఉన్నారు.



యూటీఎఫ్ ఆటల పోటీలు

ముసునూరు, ఆగస్టు 20: యూటీఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా ముసునూరు జడ్పీ పాఠశాలలో మంగళవారం ఆటల పోటీలు నిర్వహించారు. పోటీలను మండల విద్యాశాఖాధికారి బీవీ సుబ్బారావు ప్రారంభించారు. మండల వ్యాప్తంగా యూటీఎఫ్ నాయకులకు రెండు విభాగాల్లో పోటీలు జరిగాయి. రన్నింగ్ 100, 200 మీటర్లు, వాకింగ్ 400 మీటర్లు, షార్ట్‌పుట్, జావలిన్ త్రో, బాస్కెట్‌బాల్, చెస్, క్యారమ్స్ షటిల్ బ్యాడ్మింటన్, క్రికెట్, వాలీబాల్ పోటీలు జరిగాయి. విజే తలకు మండల స్వర్ణోత్సవ మహాసభలో బహుమతులు అందజేస్తామని మం డల అధ్యక్షుడు కిషోర్ తెలిపారు. ఈ పోటీల్లో డి.బెనర్జీ, జాకబ్ రాజు, వెంకటేశ్వరరావు, కె.గాంగేయుడు, విష్ణువర్ధనరావు తదితరులు పాల్గొన్నారు.



మానవత శాంతి ర్యాలీ

నూజివీడు టౌన్, ఆగస్టు 20: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నూజివీడు పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ప్రపంచ శాంతిని పరిరక్షించాలని, పర్యావరణాన్ని కాపాడాలని కోరుతూ నినాదాలు చేశారు. మానవత సేవా సంస్థ సభ్యులు కృష్ణ ప్రసాద్, అనూరాధ, ఈమని శేషయ్య, షికా ఆకాష్ పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా పరిశీలన పారదర్శకంగా జరగాలి



వేమవరప్పాడులో ఓట్ల వెరిఫికేషన్ నిర్వహిస్తున్న తహసీల్దార్

కైకలూరు ఆగస్టు 20: ఓటర్ల జాబితా పరిశీలన పారదర్శకంగా జరగాలని తహసీల్దార్ ఉదయ భాస్కరరావు అన్నారు. మంగళవారం కైకలూరు తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు. అనంతరం వేమవరప్పాడులో ఇంటింటా ఓటర్ల తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు. 1.1.2025 నాటికి 18 ఏళ్ల నిండే ప్రతి ఒక్కరూ ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అలాగే బీఎల్వోలు ప్రతి ఇంటికి వెళ్లి మరణించిన వారి పేర్లను తొలగించాలన్నారు. వీఆర్వోలు, బీఎల్వోలు పాల్గొన్నారు.

ముదినేపల్లి మండలంలో..

ముదినేపల్లి: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ముదినేపల్లి మండలంలో ప్రత్యేక ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ కార్యక్రమం ప్రారంభమైంది. తహసీల్దార్ సుబానీ పర్యవేక్షణలో బూత్ లెవల్ అధికారులు ఇంటింటి సర్వే చేపట్టారు. ఈ ప్రక్రియ అక్టోబరు 18 వరకు జరుగుతుంది. ఇందులో తొలి దశలో భాగంగా ప్రస్తుత ఓటర్ల జాబితాల్లో ఓటర్ల వివరాలు సరిగ్గా ఉన్నాయా, లేదా, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, ఓటర్ల జాబితాల్లోని డబుల్ ఎంట్రీలు తొలగింపు, గుర్తింపు కార్డుల్లో సక్రమంగా లేని ఫొటోల మార్పు, తదితర అంశాలపై సర్వే నిర్వహిస్తారు. ముదినేపల్లి మండలంలోని గ్రామాల్లో ఈ సర్వే ప్రారంభమైంది.



రాజీవ్‌కు కాంగ్రెస్ నాయకుల ఘన నివాళి

నూజివీడు టౌన్, ఆగస్టు 20: ఆధునిక భారత రూపశిల్పి రాజీవ్‌గాంధీ అని ఆయన కాలంలోనే ఐటీ యుగం ప్రారంభమైందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బి.డి. రవికుమార్ అన్నారు. రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకుని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 18 ఏళ్లకే ఓటు హక్కు, మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత ఆయనదే అన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పరిమి సాగర్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగ భరత్, పార్టీ నూజివీడు, ముసునూరు మండల అధ్యక్షులు సూర్యదేవర ప్రసాద్, యార్లగడ్డ ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.


గ్రామసభలు పారదర్శకంగా నిర్వహించాలి

చాట్రాయి, ఆగస్టు 20: మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో 23న జరిగే ఉపాధి ప్రత్యేక గ్రామ సభలను ప్రజల భాగస్వామ్యంతో పారదర్శకంగా నిర్వహించాలని ఎంపీడీవో దుర్గాప్రసాద్ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం గ్రామసభల నిర్వహణపై జరిగిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి నూతన పనులను గ్రామ సభల్లో గుర్తించి ఆమోదం తీసుకోవాలన్నారు. ఏడాదిలో ప్రతి కుటుంబానికి కల్పించే పని దినాలు, కూలీల హక్కులపై అవగాహన కల్పించాలని, ఉపాధి పథకంలో చేపట్టే పనులు పేద కూలీలు, రైతులు, గ్రామానికి ఉపయోగపడే ఉత్పాదకతను పెంచేలా ఉండాలని అన్నారు. ఎంఈవో బ్రహ్మచారి, ఏపీవో లక్ష్మీ కుమారి, ఏఈలు కృష్ణ, రఘు, అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చాట్రాయి, ఆగస్టు 20: కొత్త విద్యుత్ లైన్ల నిర్మాణం నిమిత్తం బుధవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మండలంలోని సోమవరం, మర్లపాలెం, కొత్తగూడెం, యర్రావారిగూడెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సంజయ్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపటి నుంచి గంగానమ్మ జాతర



ముదినేపల్లి, ఆగస్టు 20 : ముదినేపల్లి మండలం శ్రీహరిపురం గ్రామంలోని గంగానమ్మ ఆలయ పదో వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 22 నుంచి 25 వరకు అమ్మవారి జాతర మహోత్సవాలను నిర్వహించనున్నారు. ఆలయం వద్ద భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. 22న గ్రామస్థులు నైవేద్యాలను సమర్పించటంతో జాతర ప్రారంభమవుతుంది. 23, 24న భక్తులు మొక్కులు తీర్చుకున్న అనంతరం 25న ఊరేగింపు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

రేపు ఐబీ ఖాతాదారుల సమావేశం

మండవల్లి ఆగస్టు 20 : ఈ నెల 22వ తేదీ సాయంత్రం 4 గంటలకు మండవల్లిలోని ఇండియన్ బ్యాంక్ ఖాతాదారుల సమావేశం నిర్వహిస్తున్నామని, అన్ని వర్గాల ఖాతాదారులు పాల్గొనాలని బ్యాంక్ మండవల్లి శాఖ మేనేజర్ కె. జ్యోతి ప్రసాద్ మంగళవారం తెలిపారు. మండవల్లి ఇండియన్ బ్యాంక్ 2024వ సంవత్సరం మార్చి నాటికి రూ. 44 కోట్ల 83లక్షల డిపాజిట్‌గా స్వీకరించామని వ్యాపారులు, డ్వాక్రా గ్రూపు మహిళలకు, గోల్డ్‌లోన్సు, ఆక్వా తదితర వాటికి 77కోట్ల 13లక్షల రూపాయిలు రుణాలుగా ఖాతాదారులకు అందించామన్నారు. ఖాతాదారులు, సర్పంచ్‌లు, గ్రామ పెద్దలు సమావేశానికి హాజరై తమ సూచనలు అందించాలని స్వీకరించడం జరుగుతుందని జ్యోతి ప్రసాద్ పేర్కొన్నారు.

23న గ్రామ సభలకు ఏర్పాట్లు

ముదినేపల్లి, ఆగస్టు 20 : ఉపాధి పనుల గుర్తింపు, ప్రజావసరాలపై ప్రణాళికలను రూపొందించేందుకు ఈ నెల 23న ముదినేపల్లి మండలంలో గ్రామ సభలను నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించినట్లు ఎంపీడీవో పి.మల్లీశ్వరి తెలిపారు. సర్పంచ్‌ల అధ్యక్షతన జరుగనున్న ఈ గ్రామసభల్లో అన్ని వర్గాల వారికి ప్రయోజనం కలిగించేలా ఉపాధి పనుల ప్రణాళికలు రూపొందిస్తామని, గ్రామాల్లో ఇతర అవసరాలను కూడా ప్రజాభిప్రాయం ద్వారా గుర్తిస్తామన్నారు. ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు గ్రామసభలు జరుగుతాయని ఎంపీడీవో తెలిపారు.

ఈ క్రాప్ నమోదు తప్పనిసరి

ముసునూరు, ఆగస్టు 20: ఖరీఫ్‌లో రైతులు సాగు చేస్తున్న పంట లను తప్పనిసరిగా ఈ క్రాప్‌లో నమోదు చేయిం చుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎస్.మధుమోహన్ అన్నారు. మండల వ్యాప్తంగా జరుగుతున్న ఈ క్రాప్ నమోదు ప్రక్రియను మంగళవారం క్షేత్రస్థాయిలో ఆయన పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ఈ క్రాప్ నమోదు వల్ల రైతులు ప్రభుత్వం ద్వారా సబ్సిడీ పథకాలు పొంద వచ్చవని, ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు నష్టపోతే ఇన్‌పుట్ సబ్సిడీ, గిట్టుబాటు ధర, క్రాప్ ఇన్సూరెన్స్ పొందవచ్చని ఏవో వివరించారు.

పశువులకు టీకాలు వేయించాలి



వ్యాక్సిన్ పంపిణీ

నూజివీడు టౌన్, ఆగస్టు 20: గాలికుంటు వ్యాధి సోకకుండా పశువులకు టీకాలు వేయించాలని నూజివీడు మండలం బత్తులవా రిగూడెం సర్పంచ్ ముసునూరి లక్ష్మీ కాంతమ్మ, టీడీపీ మండల అధ్యక్షుడు ముసునూరి రాజా అన్నారు. యనమదల పశు వైద్యశాల పరిధిలో పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలను పంపిణీ చేశారు. పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి: ఎస్‌ఐ



ముసునూరు, ఆగస్టు 20: ప్రతి వాహనదారుడు నిబంధనలను పాటిస్తూ వాహనాలు నడపాలని ఎస్‌ఐ పి.వాసు అన్నారు. మంగళవారం ముసునూరు శివారు హనుమాన్ సెంటర్ వద్ద ఆయన వాహనాలను తనిఖీ చేసి మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనంలోనే రికార్డులు ఉంచుకోవాలన్నారు. . తనిఖీల్లో ఏఎస్‌ఐ నాగభూషణరావు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కైకలూరు, ఆగస్టు 20: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కైకలూరు టౌన్ సీఐ పి. కృష్ణ అన్నారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఫోన్, కంప్యూటర్ ద్వారా నెట్‌వర్క్‌ను ఉపయోగించుకొని చేసే మోసాలను సైబర్ క్రైం అంటారని అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి ఆధార్, ఓటీపీలు చెప్పమంటే చెప్పవద్దని, వాట్సాప్‌లలో వచ్చే లింకులను ఓపెన్ చేయకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కైకలూరు ప్రాంత ప్రజలకు సైబర్‌క్రైం నేరాల పట్ల అవగాహన కల్పించేందుకు కరపత్రాలు పంపిణీ చేస్తున్నామన్నారు. ఎప్పుడైనా సైబర్ నేరాలకు గురైతే తక్షణమే 1930కి కాల్ చేసి సమాచారాన్ని అందించాలన్నారు.